## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!

సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 సంచిక:308 మంగళవారం జూన్ 09, 2026 ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి పేజీలు:08 వెల.రూ. 2.00


# రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..
# గుజరాత్‌కు గులాంగిరి

## మెట్రో, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అండ్డుకుంటున్నారు

- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలపై మండిపడ్డ సిఎం రేవంత్



రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళ్లు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు.

మిగతాది 2లో

## భారత్ వద్ద 190 అణ్వాయుధాలు.. పాక్ కంటే ఎంత ఎక్కువంటే..?



ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధాల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అనేక దేశాలు తమ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నాయి. ముఖ్యంగా అణుశక్తి కలిగిన దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత పెంచుకుంటున్నాయి. మన దేశం కూడా ఈ విషయంలో వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 190 అణ్వాయుధాలు (అణు వార్‌హెడ్లు) ఉన్నాయని స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (సిప్రి) వెల్లడించింది.

పేజి 2లో ▶

## ఎన్డీయేకు 20మంది లోక్‌సభ టీఎంసీ ఎంపీల మద్దతు



పశ్చిమ బెంగాల్‌లో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ (ఏపీజ)లో తీవ్ర సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో లోక్‌సభలోని 20మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎంపీ కకోలీ ఘోష్ నేతృత్వంలో రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించారు. లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా తాను.. తోటి ఎంపీలతో సంప్రదింపుల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఘోష్ తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ.. వారు ఎన్నుకున్న ప్రభుత్వంతోనే కలిసి పని చేయాలని తమ బృందం నిర్ణయించుకుందని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంపై టీఎంసీ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ చీలికతో లోక్‌సభలో మమతాబెనర్జీ సారథ్యంలోని తృణమూల్‌కు కేవలం ఎనిమిదిమంది సభ్యులే మిగిలారు.

పేజి 2లో ▶

# మహిళా శక్తి
# మహాసభకు సర్వం సిద్ధం

- మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి
- మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి
- రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క,పొన్నం ప్రభాకర్ పిలుపు



తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు.

2లో




జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ప్రతినిధి టి రమేష్ ;జూన్ 7

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం, ప్రస్తుతం అవినీతి ఊబిలో కూరుకుపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ఆర్థిక అక్రమాలే కాకుండా, ఉద్యోగ నియామకాలు మరియు పదోన్నతుల్లోనూ అక్రమాలు జరిగినట్లు బయటపడుతున్నాయి.ఆలయ పాలనా యంత్రాంగంలో పని చేస్తున్న కొందరు ఉద్యోగుల విద్యార్హతలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మిగతాది 2లో

# కల్వకుర్తి జె ఎస్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ముగిసిన వేసవి సంగీత నృత్య బి.సోనాక్షి బి.ప్రిన్సిక శిక్షణ శిబిరం






**కల్వకుర్తి జనసముద్రం న్యూస్ జూన్ 8**

కల్వకుర్తి, జ్యోతి న్యూస్, జె ఎస్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన , విద్యార్థుల వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. జె ఎస్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో శిక్షణ పొందిన, 200 మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. జె ఎస్ డ్యాన్స్ రాష్ట్రస్థాయి వేసవి శిక్షణ శిబిరం మాస్టర్ శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, కౌన్సిలర్ బోడ నరసింహ, సీనియర్ జర్నలిస్ట్ దుబ్బ నాగేష్, బుషిపాకుల రామకృష్ణ నరేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అమితంగా ఆకట్టుకున్నాయి.

# మాచర్లలో వైభవంగా జరిగిన స్వరనీరాజనం పాటల పోటీలు




**జనసముద్రంన్యూస్, మాచర్ల, జూన్ 8 :**

గానగంధర్వుడు, పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలు పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో అత్యంత వైభవంగా జరిగాయి. డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ – మాచర్ల వారి ఆధ్వర్యంలో 'స్వర నీరాజనం' పేరుతో నిర్వహించిన తెలుగు సినీ పాటల పోటీలు సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాచర్ల పట్టణంలోని స్థానిక మానుకొండ కళ్యాణ మండపంలో ఆదివారం ఈ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల స్థాయి నుంచి భారీ సంఖ్యలో గాయనీగాయకులు తరలివచ్చి ఈ 'స్వర నీరాజనం' వేదికపై తమ ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, వైజాగ్,చీరాల వంటి సుదూర ప్రాంతాల నుంచి సైతం ప్రతిభావంతులైన కళాకారులు తరలివచ్చారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న గాయనీగాయకులందరికీ కళాపరిషత్ వారు ఉచిత భోజన వసతి సౌకర్యాలను కల్పించారు. అభ్యర్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాడుతూ శ్రోతలను, సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విజేతలకు కళాపరిషత్ నిర్వాహకులు భారీ నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిరూ. 12,000లు ద్వితీయ బహుమతి రూ. 8,000లు తృతీయ బహుమతి రూ. 5,000 లు
నగదు బహుమతులతో పాటు పాల్గొన్న గాయనీగాయకులకు పెద్ద ఎత్తున శాలువాలు కప్పి, జ్ఞాపికలు మెమెంటులతో బహూకరించి ఘనంగా సత్కరించారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ అధ్యక్షులు పఠాన్ జాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మగులూరి రాంబాబు, కోశాధికారి కాశిబోయిన శివశంకర్ వీరి నేతృత్వంలో ఈ కార్యక్రమం అత్యంత క్రమశిక్షణతో విజయవంతంగా నిర్వహించబడింది.
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రమణ్యం భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన పాటలు ఎప్పటికీ శాశ్వతంగా ఉంటాయని కొనియాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగున్న ఇలాంటి ఎందరో ప్రతిభావంతులైన గాయనీగాయకులను వెలికితీయడానికే ఈ 'స్వర నీరాజనం' కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహించినట్లు వారు తెలిపారు. ఇంతటి ఘనమైన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కళాకారులకు, పట్టణ ప్రజలకు కమిటీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని కళా పరిషత్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం కమలాసన్ రావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపియూడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి,మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు బీసీ నాయకులు బృంగా రమణారావు, ఎంబిఎస్ కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బాహాటం శేషగిరి రాజు,ఓరుగంటి చెన్నకేశవరావు, ఇల్లూరి పుల్లారెడ్డి, గట్ల కోటిరెడ్డి, విద్యా ధరణి నరసరాజు,కుర్రి సాయి మార్కొండా రెడ్డి,చుండూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం.. 9మంది కార్మికులు మృతి



విశాఖపట్నం (ఉక్కు నగరం): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్–2, ఎస్‌టీసీ–3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ పేలడంతో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 9 మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1,500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించడంతో భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అగ్నిప్రమాక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. మృతులు అప్పారావు, ప్రభాకర్‌రావు, కృష్ణ, రమణ, త్రినాథ్, అప్పలరాజు, కుమార్‌గా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. వీరిలో ఐదుగురు విశాఖ స్టీల్ ఉద్యోగులు కాగా.. ముగ్గురు ఒప్పంద కార్మికులని అధికారులు తెలిపారు.

## ప్రధాని మోదీ తీవ్ర విచారం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ. 2లక్షలు, క్షతగాత్రులకు రూ. 50వేలు చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు.

## సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడారు. పలువురు కార్మికులు చనిపోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని

# భారత్ వద్ద 190 అణ్వాయుధాలు.. పాక్ కంటే ఎంత ఎక్కువంటే..?

మొదటిపేజీ తరువాయి

పాకిస్థాన్ కంటే భారత్ వద్ద 20 అణ్వాయుధాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది.
ప్రపంచ దేశాల వద్ద అణ్వాయుధాలపై వార్షిక నివేదికను సిప్రి సోమవారం విడుదల చేసింది. ఏడాది వ్యవధిలో భారత్ 10 వార్‌హెడ్లను పెంచుకుందని ఈ నివేదిక తెలిపింది. ఇక, చైనా వద్ద 620 అణ్వాయుధాలు ఉన్నాయని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బీజింగ్ 20 అణు వార్‌హెడ్‌లను తన ఆయుధాగారంలోకి చేర్చుకుందని తెలిపింది. ఇక, ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలుగా రష్యా, అమెరికా నిలిచాయి. రష్యా వద్ద 5,420, అగ్రరాజ్యం వద్ద 5,042 అణు వార్‌హెడ్లు ఉన్నాయని సిప్రి వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి దేశాలు కలిగిన దేశాలు తొమ్మిది కాగా.. వాటి వద్ద మొత్తంగా 12వేలకు పైగా అణ్వాయుధాలు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో ఫ్రాన్స్ (370), యూకే (225), ఇజ్రాయెల్ (90), ఉత్తరకొరియా (60) దేశాలున్నాయి.
ఇక, ప్రపంచంలోనే అత్యధిక రక్షణ వ్యయం ఉన్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉంది. 2025లో భారత రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సిప్రి నివేదిక తెలిపింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8.9శాతం ఎక్కువ. ఇక, 2021–25 మధ్య ప్రపంచవ్యాప్తంగా రక్షణ దిగుమతుల్లో 8.2శాతం మన దేశానివే.

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ. 5 లక్షల రుణ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.
భ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ. 500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అ÷–దదె బస్సుల హైర్ చార్జీల కింద రూ. 20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్ఆర్టీసీకి రూ. 199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷–దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ. 10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. ÷రిళిమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ వ్యాపారాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఈ మహాసభలో భాగస్వామ్యం కావాలని, మహిళా ఐక్యత, ఆత్మవిశ్వాసం, ఆర్థిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ.. గుజరాత్‌కు గులాంగిరి

మొదటిపేజీ తరువాయి

రూ. 65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు.
రూ. 229 కోట్లతో ఓఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు కోసం ప్రధాన వంతెన నిర్మాణం, ఓఆర్ఆర్ నుంచి కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రూ. 110కోట్లతో శంకర్‌పల్లి రోడ్ నుంచి మణికొండ వరకు పైప్ లైన్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. రూ. 29.25కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపంలోని రెండు రైల్వే ఓవర్ హెడ్స్ వరకు నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. రూ. 26.50కోట్లతో నానక్‌రామ్‌గూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ వైపు ఉన్న ప్రధాన క్యారేజ్ వే విస్తరణకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ. 14.40కోట్లతో మాదాపూర్, నానక్‌రామ్‌గూడలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి సీఎం రేవంత్ కొబ్బరికాయ కొట్టారు. అనంతరం మియాపూర్‌లో 'ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సభకు మంత్రి శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమెల్యేలు అరికెపూడి గాంధీ, మాల్ రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే



త్వరలో ఆక్వా రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో భూ రికార్డుల సంస్కరణలు, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి జిల్లాలు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా నిలిచాయని కొనియాడిన సీఎం.. ఈ ప్రాంత రైతులు భూమిని సమర్థంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని, భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం సీఎం చెప్పుకొచ్చారు. భూమి రికార్డులను మరింత భద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌లు, అధునాతన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నాము. కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ప్రమాణాల తరహాలో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు అందిస్తున్నాము. రీ–సర్వే, ఈ–కేవైసీ పక్రియల అనంతరం మాత్రమే పాస్ పుస్తకాలు ముద్రిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ–సర్వే పూర్తి చేసి 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసాము. ఇంకా 62.32 లక్షల పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా 90 లక్షల మంది భూ యజమానులకు పాస్ పుస్తకాలు అందజేయడమే లక్ష్యం. గత పాలనలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు మూడు సంవత్సరాల పాటు కృషి చేయాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖలో సమూల
మార్పులు తీసుకొస్తున్నాము. రీ–సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేసాం. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల భూ లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ వ్యవస్థను అమలు చేస్తున్నాము. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేస్తూ రూ. 10 లక్షల లోపు ఆస్తులకు కేవలం రూ. 100తో బదిలీ సౌకర్యం కల్పించాము. అంతకంటే ఎక్కువ విలువ గల ఆస్తులకు రూ. 1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది' అని సీఎం చెప్పారు. అలాగే పాత భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని.. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ రికార్డులను డిజిటల్ రూపంలోకి తీసుకువస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని, 15 జిల్లాల్లోని 33,012 ఎకరాల షరతు గల పట్టా భూములపై ఆంక్షలను కూడా ఎత్తివేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోందని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల్లో 46 లక్షల మంది రైతులకు రూ. 8,985 కోట్లు జమ చేశామని, కేంద్ర ప్రభుత్వ సహాయంతో కలిపి ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు రావడానికి నెలల తరబడి పట్టేదని, ప్రస్తుతం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువలు, చెరువుల మరమ్మతులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆక్వా చెరువులకు యూనిట్‌కు రూ. 1.50కే విద్యుత్ అందిస్తున్నామని, దాణా ధరలు పెరగడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. ఆక్వా రంగం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలకు కీలకమని పేర్కొన్న సీఎం, ఆ రంగానికి అన్ని విధాలా మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను వినియోగించి న్యూట్రాస్యూటికల్ ఔషధాల తయారీకి అవకాశాలు ఉన్నాయని కూడా సూచించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులివ్వండి:

మొదటిపేజీ తరువాయి

నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందని పవన్ కల్యాణ్ చెప్పారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకోసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# మమతకు వరుస షాక్‌లు..

మొదటిపేజీ తరువాయి

బెంగాల్ శాసనసభలో ఇప్పటికే టీఎంసీ ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయారు. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని 58 మందికి పైగా తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందం తామే నిజమైన తృణమూల్ వర్గం అని ప్రకటించుకుంది. టీఎంసీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ అయిన సుఖేందు శేఖర్ రాయ్ (ాబన్ప్త్రవఅఎబ =శీఎ) తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

# ద్వారకాతిరుమల ఆలయంలో 'ఫేక్' సర్టిఫికెట్ల బాగోతం.. అటెండర్ స్థాయి నుంచి ఉన్నత పదవుల వరకు అవినీతి పర్వం.

మొదటిపేజీ తరువాయి

స్థానికుల కథనం ప్రకారం, కనీసం పదో తరగతి కూడా ఉత్తీర్ణులవ్వని వారు, ప్రైవేటు విద్యా సంస్థల ద్వారా పొందిన 'ఫేక్' డిగ్రీ సర్టిఫికెట్లను బి ఏ, బీకాం సమర్పించి ఉద్యోగాల్లో చేరడమే కాకుండా, అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.అటెండర్ స్థాయి నుంచి ఉన్నత స్థానాలకు ఎదిగిన కొందరు ఉద్యోగులు, దొంగ సర్టిఫికెట్లను చూపి అధికారులను బురిడీ కొట్టించారనేది స్థానికుల ప్రధాన ఆరోపణ.ఈ వ్యవహారంపై గతంలో పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ, ఉన్నతాధికారులు వాటిని పట్టించుకోకుండా, అక్రమాలకు పాల్పడిన వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అసలైన విద్యావంతులకు అవకాశం దక్కకుండా, ఇలాంటి అనర్హులు ఆలయ వ్యవస్థలో కీలకంగా మారడం వల్లనే నకిలీ టికెట్ల కుంభకోణం, ఆదాయం దారి మళ్లించడం వంటి అక్రమాలు సులభంగా జరుగుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.భక్తుల డిమాండ్"స్వామివారి సొమ్మును, ఆలయ పవిత్రతను కాపాడాల్సిన వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణం. తప్పుడు సర్టిఫికెట్లతో పదవుల్లో ఉన్న వారిని వెంటనే గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సంబంధిత ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ చేపట్టి,



నిజానిజాలను భక్తుల ముందు ఉంచాలి" అని స్థానిక భక్తులు మరియు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.
అర్హత లేని వారి చేతుల్లో ఆలయ పాలన ఉండటం వల్ల, స్వామివారికి రావాల్సిన ఆదాయం భారీగా హరించుకుపోతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# ప్రత్యేక సభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు,

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 8, 2026:**





ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31, 32 డివిజన్లకు సంబంధించి లక్ష్మీ గార్డెన్స్ లో నిర్వహించిన డివిజన్ సభకు డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, 31వ డివిజన్ కార్పొరేటర్ సంపత్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక గ్రామ/డివిజన్/వార్డు సభలు నిర్వహించి, పారిశుధ్యం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ, అరైవ్- అలైవ్, ఇందిరమ్మ ఇండ్లు, సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, తడి చెత్త, పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వేరువేరుగా సేకరించి నిర్వీర్యం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని, వర్షం వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ కాకుండా ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాల అందజేత, స్వీకరణ, చనిపోయిన, డబుల్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్- అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, గత సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకం కూడా అందించడం జరుగుతుందని, జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసిల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు. మంచిర్యాల డి.సి.పి, ఏ. భాస్కర్, మాట్లాడుతూ ప్రజలందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాలికల సంరక్షణ కొరకు షీ టీం సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని, తెలిసిన వాళ్ళు ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగించినట్లు సమాచారం ఇస్తే వారిని డి-అడిక్షన్ సెంటర్ కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే 100 నెంబర్ కు డయల్ చేసి వెంటనే సమాచారం అందించడం ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ డి. మధుకర్, మాట్లాడుతూ "మంచిర్యాల శుభ్రత- ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత" నినాదంతో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, వీధి దీపాలు, రోడ్ల మరమ్మత్తులు, త్రాగునీటి సదుపాయం, మురుగు కాలువల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజాపాలన ద్వారా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని, ఎలాంటి అవినీతి, దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల సంబంధిత ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# సిపిఐ నాయకుడు డి. రమణయ్యను పరామర్శించిన సిపిఐ నేతలు..

**మల్కాజిగిరి, 08 జూన్ (జనసముద్రం న్యూస్):**



మల్కాజిగిరి మండల సిపిఐ సీనియర్ నాయకులు డి. రమణయ్య హెర్నియా ఆపరేషన్ అనంతరం అస్వస్థత కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో, సోమవారం నిర్మల్‌నగర్‌లోని వారి నివాసానికి సిపిఐ నాయకులు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఆకాంక్షిస్తూ మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు సిహెచ్. దశరథ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి. యాదయ్య గౌడ్, మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు, సీనియర్ నాయకులు పి. సత్యనారాయణ, జి. రాములు, ఎస్.కే. అజీజ్, బి. వేమయ్య, జి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. సిపిఐ నాయకులు డి. రమణయ్య త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణిలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని నల్గొండ జిల్లా కలెక్టర్‌కు వినతి

**జన సముద్రం న్యూస్ జూన్ 8.దేవరకొండ. జిల్లా. నల్గొండ**




తమకు నివాసం ఉండటానికి స్వంత ఇల్లు లేదని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ నల్గొండ జిల్లా దేవరకొండ మండలం గాంధీనగర్‌కు చెందిన చేరిపల్లి భార్గవి సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బాధితురాలు భార్గవి (భర్త గోవర్ధన్) మాట్లాడుతూ, తాము గత కొంతకాలంగా గాంధీనగర్ పరిధిలో అద్దె ఇంట్లో నివసిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకొండ మండలం గాని, నల్గొండ జిల్లాలో గాని తమకు ఎలాంటి స్వంత ఇల్లు లేదని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

తమ నిరుపేద పరిస్థితిని పరిశీలించి, మానవతా దృక్పథంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక ఇల్లు మంజూరు చేయాలని ఆమె జిల్లా ఉన్నతాధికారులను వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్వయంగా కలిసి దరఖాస్తును అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు.

# ఎల్కతుర్తిలో మురుగు కాలువల శుభ్రతకు శ్రీకారం

## పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత: సర్పంచ్ లావణ్య

**ఎల్కతుర్తి, జూన్ 8 (జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం మురుగు కాలువల శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పోక్లైన్ యంత్రంతో గ్రామంలోని పలు వార్డుల్లో ఉన్న మురుగు కాలువలను శుభ్రం చేశారు. గ్రామ సర్పంచ్ మునిగడప లావణ్య-శేషు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనురాగ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పర్యవేక్షణలో కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మునిగడప లావణ్య మాట్లాడుతూ, మురుగు కాలువల శుభ్రత వల్ల దోమలు, అంటువ్యాధుల వ్యాప్తి తగ్గడంతో పాటు వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు కూడా సహకరించాలని పంచాయతీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు జన్నారపు వెంకటేష్, కొత్తకొండ అజయ్, వేముల నవీన్, కారోబార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీదర్ ఝురణి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ముడంబై వెంకటా రమణాచార్యులు





**మల్కాజ్‌గిరి08 జూన్ (జనసముద్రం న్యూస్):**

కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో వెలసిన ప్రసిద్ధ భూగర్భ జలగుహాలయమైన ఝురణి లక్ష్మీనరసింహస్వామిని మల్కాజ్‌గిరి ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయ అర్చకుడు ముడంబై వెంకటా రమణాచార్యులు సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించిన రమణాచార్యులు ఆలయ విశిష్టతను, ఆధ్యాత్మిక వైభవాన్ని కొనియాడారు. ఈ దర్శన కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జీతాల్లేని జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వాలి.

## సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ( ఐ ఏ ఎస్ ) కు టి డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న వినతి

**జనసముద్రం న్యూస్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ,**



కాగజ్ నగర్,జూన్ 8, 2026: ఎలాంటి వేతనాలు లేకుండా, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి అహర్నిశలు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టి డబ్ల్యూ జె ఎఫ్) కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఐఏఎస్ కు యూనియన్ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు ఎలాంటి నెలవారీ జీతాలు లేక, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం కోసం నిరంతరం తపించే జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభం అయినప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలాది రూపాయల ఫీజులు చెల్లించలేక తమ పిల్లల చదువులను సాగించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. జర్నలిస్టుల కుటుంబాల దయనీయ ఆర్థిక పరిస్థితులను మానవీయ కోణంలో పరిశీలించి, ప్రతి ఒక్క జర్నలిస్టు పిల్లలకు రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికే 50 శాతం ఫీజు రాయితీ వర్తించేలా తక్షణమే ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వడ్నాల వెంకన్న తో పాటు ఈర్ల సునీల్ కుమార్, ఎండి నౌషాద్, కడారి శ్రీనివాస్, రాజనర్సయ్య, సిహెచ్ తరుణ్, అన్న బోయిన రాజు, వేల్పుల ప్రదీప్, జి వెంకటేష్, రమేష్ సోనాలె, హైమద్ పాషా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భద్రగిరి మార్ట్ లో పాఠశాలలకు ఉపయోగపడేఅన్ని వస్తువులు సరసమైన ధరలకు లభించును. పి ఓ ఐ టి డి ఏ





**జన సముద్రం న్యూస్ జూన్ 8 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**

భద్రాచలం పట్టణ ప్రజలకు మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తెలియజేయునది ఏమనగా భద్రాచలం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ లో అన్ని పాఠశాలలకు సంబంధించిన అన్ని రకాల నోట్ బుక్స్ సరసమైన ధరలకు భద్రగిరి మార్ట్ లో అందుబాటులో ఉన్నాయని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. నోట్ బుక్స్ తో పాటు జామెంట్రీ బాక్సులు ఇతర పాఠశాలలకు సంబంధించిన అన్ని రకాల వస్తువులు లభించునని పిల్లల తల్లిదండ్రులు ఇట్టి విషయాన్ని గమనించి భద్రగిరి మార్ట్ లో తక్కువ ధరలకు లభించే పాఠశాలలకు సంబంధించిన నోట్ బుక్స్ ఇతర మెటీరియల్స్ కొనుగోలు చేసి భద్రగిరి మార్ట్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

# ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన...

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్...

**మెదక్ జిల్లా, ప్రతినిధి, జూన్08( జన సముద్రం న్యూస్):-**







ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.

సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు.

అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు.

గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ గఫార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఎల్కతుర్తి పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**ఎల్కతుర్తి, జూన్ 8(జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం బ్రిడ్జి సమీపంలో ఎల్కతుర్తి పోలీసులు సోమవారం విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్సై నర్సింహారావు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు మద్యం తాగి వాహనాలు నడపరాదని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. అలాగే పలు వాహనాల పత్రాలను పరిశీలించి, సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించినట్లు ఎల్కతుర్తి ఎ ఎస్ ఐ శంకర్ తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ సారంగపాణి, కానిస్టేబుల్ సుమన్, ఎస్‌జీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెరోజ్ ఖాన్ జ్ఞాపకార్థం సందర్బంగా మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో అన్నదానం

**కోరుట్ల నియోజకవర్గం జన సముద్రం న్యూస్ మొహమ్మద్ అఫ్రోజ్ జూన్ 8 మెట్ పల్లి:**





ఫెరోజ్ ఖాన్ జ్ఞాపకార్థం సందర్భంగా మిత్రులా సహకారం తో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మిత్రులు రవి మాట్లాడుతూ కీ "శే " ఫెరోజ్ ఖాన్ ఎప్పుడు సేవ కార్యక్రమంలో ముందు ఉండేవారని ప్రతి రోజు మెట్ పల్లి బస్సు డిపో ప్రాంతంలో ఉదయం నిరుపేదలకు కూలీలకు టిఫిన్ అందించేవరని కీ "శే " ఫెరోజ్ ఖాన్ సేవలను కొనియాడారు ఈ కార్యక్రమం లో రవి.విలోక్. రాజేష్. శేఖర్. వెంకటేష్. అనిల్. అజార్. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పుల్ల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి,

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 8, 2026:**





ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్ లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన రాజు గౌడ్ తాను డిగ్రీ, పి జి డి సి ఏ, డి.ఈడి. పూర్తి చేశానని, గతంలో కంటి వెలుగు కార్యక్రమంలో పనిచేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చెన్నూర్ మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన సైదల పద్మ తన ప్రజా పాలన వివరాలను దుగ్నేపల్లి గ్రామపంచాయతీ నుండి చెన్నూరు మున్సిపాలిటీకి మార్పు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన కదారి బీరయ్య తనకు గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉందని, ఊరిలోని అందరి ఇళ్ళ నుండి వచ్చే మురుగునీరు తన భూమిలోకి రావడంతో వ్యవసాయ సాగు చేయలేకపోతున్నానని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని సుభాష్ రోడ్ కు చెందిన జె.శాంతయ్య తాను సింగరేణి ఉద్యోగం చేసి పదవి విరమణ పొందానని, తాను కష్టార్జితంతో కొనుగోలు చేసిన ఇంటిని తన పెద్ద కుమారుడు ఆక్రమించుకున్నాడని, తన చిన్న కుమారునికి సింగరేణి ఉద్యోగం కల్పించానని, ప్రస్తుతం తన కుమారులు తన, తన భార్య బాగోగులు చూడడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భూపాలపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన బుర్ర లచ్చయ్య తన తండ్రి పేరిట జైపూర్ మండలం షెట్ పల్లి గ్రామ శివారులో భూమి ఉందని, ఆయన మరణానంతరం కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అంగడి రాములు తనకు గతంలో 88 శాతం దివ్యాంగత్వం నిర్ధారించబడి పింఛన్ మంజూరు అయిందని, ఇప్పుడు తక్కువ శాతంతో నిర్ధారించడంతో పింఛన్ ఆగిపోయిందని, నిరుపేద అయిన తన పరిస్థితి అర్థం చేసుకొని పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ ప్రాంతవాసులు తమ ప్రాంతంలోని రైల్వే గేట్ వెనక ఏర్పాటు చేస్తున్న బార్ కం రెస్టారెంట్ నివాస గృహాల మధ్యన రైల్వే ఫుడ్ ఓవర్ బ్రిడ్జికి అతి సమీపంలో ఉన్నందున అభ్యంతరాలు తెలుపుతున్నామని, బార్- రెస్టారెంట్ ఏర్పాటు నిలుపుదల చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పి డి ఎస్ యు ప్రతినిధులు తమ దరఖాస్తులో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల పట్టిక నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని కోరారు. చెన్నూర్ పట్టణంలోని పద్మ నగర్ కు చెందిన తన్నీరు ప్రమీల నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుణ్యశ్లోక రాజమాత అహిల్యాబాయి హోల్కర్ 301వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**మల్కాజిగిరి జనసముద్రం న్యూస్ జూన్ 08**



గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని వాణి నగర్‌లో పుణ్యశ్లోక రాజమాత అహిల్యాబాయి హోల్కర్ 301వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సూర్నర్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని అహిల్యాబాయి హోల్కర్ జీవిత విశేషాలు, పరిపాలనా విధానం గురించి వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహిల్యాబాయి హోల్కర్ భారతదేశ చరిత్రలో గొప్ప పాలకురాలని, 1767 నుండి 1795 వరకు మాల్వా రాజ్యాన్ని ధర్మం, న్యాయం, ప్రజాహితం మరియు సుశాసనంతో పరిపాలించి ఆదర్శంగా నిలిచారని తెలిపారు.

ప్రజల ఫిర్యాదులను స్వయంగా విని పక్షపాతం లేకుండా న్యాయం చేయడం, పేద-ధనిక అనే తేడా లేకుండా సమాన న్యాయం అందించడం ఆమె పరిపాలన ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం బావులు, చెరువులు, ఘాట్లు, ధర్మశాలలు నిర్మించడంతో పాటు యాత్రికుల కోసం విశ్రాంతి గృహాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.

దేశవ్యాప్తంగా కాశీ విశ్వనాథ్, సోమనాథ్, మహాకాళేశ్వర్ వంటి అనేక ప్రముఖ దేవాలయాల నిర్మాణం, పునరుద్ధరణకు ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. రైతులకు ప్రోత్సాహం అందించి, వాణిజ్య అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పన్నుల వ్యవస్థను సరళంగా, న్యాయబద్ధంగా అమలు చేశారని చెప్పారు.

"ప్రజల సుఖమే పాలకుడి సుఖం" అనే సిద్ధాంతంతో పాలించిన అహిల్యాబాయి హోల్కర్ చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాంబాబు, సదాశివరావు, దేవదాస్, బాలసుబ్రహ్మణ్యం, వెంకట్ కిషోర్ పెంటయ్య, శ్రీమతి స్వర్ణలత, రాజేష్, సాయిబాబా, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థతో ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా

**– ఉత్తమ్ జాడే ఎస్.ఈ వెల్లడి**

**జనసముద్రం న్యూస్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 8,2026**



అసిఫాబాద్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉత్తమ్ జాడే సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ తెలిపారు. ఏదైనా ఒక సబ్‌స్టేషన్, లైన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా, ప్రకృతి వైపరీత్యాలు, గాలివానలు, వరదలు, అత్యవసర మరమ్మతులు లేదా ఇతర సాంకేతిక కారణాల వలన ఏర్పడే విద్యుత్ అంతరాయాలను నివారించడానికి వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఆధునిక ఇంటర్‌లింక్ లైన్ (అనుసంధాన) వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

అసలు ఏమిటి ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థ

సాధారణంగా ఒక విద్యుత్ లైన్‌లో లోపం ఏర్పడితే ఆ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అయితే ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థ ద్వారా ఒక / సబ్‌స్టేషన్‌ను మరో / సబ్‌స్టేషన్‌తో, ఒక / సబ్‌స్టేషన్‌ను సమీపంలోని / సబ్‌స్టేషన్‌తో, అలాగే ఒక లైన్‌ను మరో లైన్‌తో అనుసంధానం చేయడం జరుగుతుంది.

దీని ఫలితంగా ఒక మార్గంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భంలో వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతారు. దీంతో వినియోగదారులకు విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో కూడా నిరంతరాయ విద్యుత్ సరఫరా కొనసాగుతుంది.

అదేవిధంగా రెండు లైన్ల మధ్య కూడా ఇంటర్‌లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామని మరియు ఐదు ఇంటర్లింకింగ్ లైన్ ల పనులు పురోగతిలో వున్నాయి , దీనివల్ల విద్యుత్ సరఫరాలో మరింత స్థిరత్వం సాధించగలిగామని పేర్కొన్నారు.

ఈ ఇంటర్‌లింక్ వ్యవస్థ ద్వారా వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, ఏదైనా లైన్‌లో లోపం ఏర్పడినప్పుడు లేదా నిర్వహణ పనులు చేపట్టాల్సిన సందర్భంలో ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్‌ను కొనసాగిస్తూ మరమ్మతులు సులభంగా నిర్వహించగలుగుతున్నామని తెలిపారు.

మిగిలిన ప్రాంతాల్లో కూడా ఈ వ్యవస్థను విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి దశలవారీగా అమలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే స్పష్టం చేశారు.

# కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో ప్రత్యేక వార్డు సభ నిర్వహణ





**జనసముద్రం న్యూస్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 8, 2026**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక వార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అలాగే మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు.

సభలో పలువురు స్థానికులు తమ వార్డుకు సంబంధించిన సమస్యలను మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, సూచనలను అధికారులు నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో పాటు వార్డు అభివృద్ధిని మరింత వేగవంతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, 21వ వార్డు కౌన్సిలర్ దూసరి కృష్ణవేణి, శివ గౌడ్, మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి, మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు...

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జిల్లా, ప్రతినిధి, జూన్ 08 (జన సముద్రం న్యూస్):-**





వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రిల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో గల పిల్లి కొట్యాల్ ఏరియాలో గల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జి జి హెచ్ ఎస్ సూపరిండెంట్ డాక్టర్ సునీత, ఆధ్వర్యంలో

నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ షర్మిల, జి జి హెచ్ ఎస్ ఆర్ ఎం ఓ రేవతి డి సి హెచ్ ఎస్ శివదయాల్, ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా

హెచ్ ఓ డి జనరల్ మెడిసిన్ డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ రాజేశ్వరి , మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ పావని, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు. బోస్ రాజశేఖర్ , బోని, కౌన్సిలర్ విశ్వం లతో కలిసి ఆసుపత్రుల అభివృద్ధి సంఘం సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆసుపత్రి అభివృద్ధి పనులకు గాను అవసరమైన బడ్జెట్ కేటాయింపు కొరకు ప్రతిపాదించడం జరిగిందని, ఇందులో భాగంగా ఆసుపత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది నియామకం, ఆసుపత్రి నిర్వహణ, అంబులెన్స్ ఇతర అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స, వైద్య పరికరాలు, పెండింగ్ బిల్లుల కోసం చర్చించడం జరిగింది అన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ఆ దిశగా నర్సులు, ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులు, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, , ఆసుపత్రిలో ప్రజా ప్రయోజనకరంగా అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు.

అనంతరం నూతనంగా నిర్మించి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ విభాగాన్ని కలెక్టర్ సందర్శించి, వైద్యాధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి,



**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**



**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 8, 2026:**

ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 95 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి ...

**చివరి దశలో ధాన్యం కొనుగోళ్లు ... అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి ...**

**జిల్లా వ్యాప్తంగా 82,251 మంది రైతుల నుంచి 3,80,358 .240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,65,394 మంది రైతులకు 694,32 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి**

**జిల్లా వ్యాప్తంగా 268 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత..**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ..**

**మెదక్ జిల్లా, ప్రతినిధి, జూన్ 08 (జనసముద్రం న్యూస్):-**





జిల్లా లో ధాన్యం కొనుగోళ్లు 95 శాతం పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..చివరి దశలో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని, అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 82,251 మంది రైతుల నుంచి 3,80,358 .240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,65,394 మంది రైతులకు 694,32 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 268 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు పూర్తి అయిన కేంద్రాల్లోని సిబ్బంది, వాహనాలు, హమాలీనీ ధాన్యం కొనుగోళ్లు నడుస్తున్న కేంద్రాల్లో ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి త్వరిత గతిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,సివిల్ సప్లై శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు,ఆర్డీవోలు, తహశీల్దార్లు,ధాన్యం సేకరణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి జె ఎస్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ముగిసిన వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరం

**కల్వకుర్తి జనసముద్రం న్యూస్ జూన్ 8**




కల్వకుర్తి, జ్యోతి న్యూస్, జె ఎస్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన , విద్యార్థుల వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. జె ఎస్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో శిక్షణ పొందిన, 200 మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. జె ఎస్ డ్యాన్స్ రాష్ట్రస్థాయి వేసవి శిక్షణ శిబిరం మాస్టర్ శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, కౌన్సిలర్ బోడ నరసింహ, సీనియర్ జర్నలిస్ట్ దుబ్బ నాగేష్, బుసిపాకుల రామకృష్ణ కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అమితంగా ఆకట్టుకున్నాయి.



# సుపరిపాలన, అభివృద్ధి, ఆత్మనిర్భర భారత నిర్మాణ యజ్ఞానికి 12 సంవత్సరాలు

బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి గారు తన శాఖలో ఈ 12 ఏళ్లలో జరిగిన అభివృద్ధి, సంస్కరణల గురించిన ప్రెస్ బ్రీఫింగ్ లో వివరించిన అంశాలులిప్రధానమంత్రి నరేంద్రమోదీ గారి నాయకత్వంలో 2014లో ప్రారంభమైన సుపరిపాలన, అభివృద్ధి, ఆత్మనిర్భర భారత నిర్మాణ యజ్ఞానికి 12 సంవత్సరాలు పూర్తయ్యాయి.అన్ని రంగాల్లో ఈ సంస్కరణలు గ్రామాల్లోని పొదుపు సంఘాల పురోగతి నుంచి స్పేస్ సెక్టార్ వరకు ప్రతి రంగంలోనూ ఎన్నో మైలురాళ్లు అందుకున్నాం.అని భారతదేశ సమగ్రాభివృద్ధి, సంస్కరణల ప్రయాణంలో ఇవాళ మనం ఓ కీలకమైన మైలురాయిని చేరుకున్న సందర్భంగా.. నేను బాధ్యతలు నిర్వర్తిస్తున్న బొగ్గు, గనుల రంగంలో ఈ 12 ఏళ్లలో.. వచ్చిన గణనీయమైన మార్పులు, తీసుకొచ్చిన సంస్కరణలు, సాధించిన విజయాలను మీతో పంచుకుంటున్నాన ని అన్నారు అత్యంత విప్లవాత్మకమైన సంస్కరలను బొగ్గు, గనుల రంగం ప్రతీకగా నిలుస్తోంది.బొగ్గు రంగంలో 5 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి, 25 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాం.అని దేశ ఆదాయం, ఉపాధికల్పన, సర్క్యులర్ ఎకానమీ విషయంలో బొగ్గు, గనుల రంగం పాత్ర అత్యంత కీలకం.అని రైల్వేల్లో 51% ప్రయాణికులకు సబ్సిడీ ద్వారా సేవలందిస్తున్నారు. రైల్వేలకు ఎక్కువ లాభం ఫ్రైట్ ట్రాన్స్‌పోర్టేషన్ ద్వారా చేకూరుతుంది. ఇందులో 51% బొగ్గు రవాణా ద్వారానే లభిస్తోంది.ఏడాదికి దాదాపు 90వేల కోట్లు బొగ్గు రవాణా ద్వారా అందుతోంద ని అన్నారు విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు పాత్ర కీలకం.యూపీయే హయాంలో.. విద్యుత్ కొరతలతో.. ఇందిరాపార్క్ వద్ద ధర్నాలు జరిగిన విషయం మనందరికీ తెలుసు.కానీ ఇవాళ దేశవ్యాప్తంగా నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నాం అని కాంగ్రెస్ హయాంలో.. కోల్ అంటే అవినీతి, అసమర్థత కి కేరాఫ్ అడ్రస్ గా ఉండేవి.కాంగ్రెస్ హయాంలో.. అవినీతి కారణంగా.. బొగ్గుమంత్రే జైలుకెళ్లార ని సీతారాం కేసరి తెల్ల కాగితం పైన రాసిస్తే.. మన్మోహన్ సింగ్ గారు బొగ్గు గనులను కేటాయించేవారు.అలాంటి పరిస్థితులనుంచి ఇవాళ బొగ్గు రంగాన్ని పూర్తిగా సంస్కరించాం.పొరపాట్లు, అక్రమాలు, అవినీతి జరగకుండా.. సుప్రీంకోర్టు ఆదేశాలను తూ.చా తప్పకుండా పాటిస్తూ.. బొగ్గు రంగాన్ని రీవ్యాంప్ చేశాం.గత 12 ఏళ్లలో ఒక్కటంటే ఒక్క అక్రమం, అవినీతి జరగకుండా.. ప్రధాని మోదీ గారి నేతృత్వంలో మార్పులు తీసుకొచ్చాం.అని తెలిపారు ఇవాళ ప్రపంచంలో రెండో అతిపెద్ద కోల్ ప్రొడ్యూసర్ గా ఉన్నాం. రెండో అతి పెద్ద వినియోగదారుగా ఉన్నాం.అదృష్టవశాత్తూ.. మన వద్ద బొగ్గు రిజర్వ్స్ ఎక్కువగా ఉన్నాయ ని ప్రపంచంలో 5వ అతిపెద్ద బొగ్గు రిజర్వ్స్ మన దగ్గర ఉన్నాయి.గెవరా ప్రపంచంలోనే.. రెండో అతిపెద్ద కోల్ మైన్. పక్కనే ఉన్న కుస్ముందా ప్రపంచంలోనే 4వ అతిపెద్ద బొగ్గు గనిగా ఉంది.మన కోలిండియా కంపెనీ.. ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉంది.విద్యుదుత్పత్తిలో.. 72% బొగ్గు ద్వారానే జరుగుతోంది.426 గనుల్లో బొగ్గు ఉత్పత్తి అవుతోంది.మా పీఎస్‌యూలు, క్యాప్టివ్, కమర్షియల్ మైన్స్ ద్వారా ఈ ఉత్పత్తి జరుగుతోంద ని గతేడాది, ఈ ఏడాది బిలియన్ టన్ ఉత్పత్తిని సాధించాం. ఇది రికార్డు స్థాయిలో ఉత్పత్తిని ప్రదర్శిస్తోంది.ప్రధాని




మోదీ ప్రతివారం దీనిపై రివ్యూ చేస్తార ని అన్నారు బొగ్గు ఎంత ఉత్పత్తి అయింది, ట్రాన్సిట్ లో ఎంతుంది, పిట్ హెడ్ వద్ద ఎంత ఉంది, పవర్ కంపెనీల వద్ద ఎంత బొగ్గు నిల్వలున్నాయి అనేది రివ్యూ చేస్తారు.189 మిలియన్ టన్నుల కోల్ కంపెనీలు, ట్రాన్సిట్ లో, విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉంది.ఇది 85 రోజులకు సరిపోతుంది.ఏ పరిస్థితులొచ్చినా.. విద్యుదుత్పత్తిలో అంతరాయం జరగకూడదనే లక్ష్యంతో ప్రతి రోజూ మానిటరింగ్ చేస్తున్నాం.బొగ్గు ద్వారా విద్యుదుత్పత్తికి మాత్రమే కాదు.. అనేక రకాల కీలక రంగాలకు కూడా బొగ్గు చాలా అవసరం.అని చెప్పారు స్టీల్ ఉత్పత్తి, సిమెంట్, ఫర్టిలైజర్, స్పాంజ్ ఐరన్, కెమికల్స్ వంటి ప్రముఖ రంగాలకు బొగ్గు ప్రధానమైన రా మెటీరియల్ కోల్ ద్వారా వివిధ రంగాల్లోనూ కోట్ల ఉద్యోగాలు కల్పించడంలో బొగ్గు కీలకమైన వనరు.భారతదేశంలో ప్రధాన రంగాలు.. కోల్ ఇంపోర్ట్ చేసుకునేవి. మన దగ్గర ఇన్ని రిజర్వ్స్ ఉన్నప్పుడు ఎందుకు ఇంత దిగుమతి చేసుకోవాలని మోదీ ప్రశ్నించేవారు.ఈ ఆలోచనతో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా.. ఇవాళ బొగ్గు దిగుమతి తగ్గుతోంది.గతేడాది 4% బొగ్గు దిగుమతులు తగ్గాయి. గతేడాది.. బొగ్గు దిగుమతి తగ్గించడం ద్వారా రూ.60వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకోగలిగాం.రానున్న రోజుల్లో మరింతగా ఈ దిగుమతులను తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నాం.బొగ్గు రంగంలో అనేక మార్పులొస్తున్నాయి.ట్రక్కుల ద్వారా బొగ్గు రవాణాతో.. ఖర్చు పెరుగుతోంది. సమయం పడుతోంది, పొల్యూషన్ కూడా పెరుగుతోంది.అందుకే.. దీనిపై దృష్టి సారించి.. ఫస్ట్ మైల్ కనెక్టివిటీ (ఫీవీజ) ని అభివృద్ధి చేస్తున్నాం.మైన్స్ ఎక్కువగా ఉన్న చోట.. రైల్వే లైన్లను వేసుకుంటున్నాం.ఇవాళ ప్రయివేటు రంగాన్ని కూడా బొగ్గు ఉత్పత్తిలో భాగస్వాములను చేస్తున్నాం.మనకు ఉన్నటువంటి భారీ రిజర్వులను సద్వినియోగం చేసుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం.అని చెప్పారు దేశ ప్రజలకు, దేశాభివృద్ధికి మన రిజర్వ్స్ ఉపయోగపడాలనేది మోదీ గారి ఆలోచన.గతంలో తెల్లకాగితాలపై రాసిస్తే.. కోల్ బ్లాక్స్ కేటాయింపులు జరిగేవి.సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ బ్లాక్స్ ను రద్దుచేసింది.మేం వేలం పద్ధతిని తీసుకొచ్చాం. పారదర్శకమైన పద్ధతిలో కోల్ బ్లాక్స్ వేలం వేస్తున్నాం.దీంతో ప్రయివేట్ రంగంలోనూ.. పోటీ పెరిగింది.అని కోల్ బ్లాక్స్ కేటాయింపులు జరిగిన తర్వాత.. పూర్తిస్థాయిలో ఎక్స్ ప్లోరేషన్ చేయాలి, ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్, ఫారెస్ట్ క్లియరెన్స్ రావాలి, గ్రామసభ అనుమతులు రావాలి. ఇలా చాలా క్లియరెన్సెస్ అవసరం ఉంటుంది.అయినప్పటికీ.. వాటన్నింటినీ దాటుకుని.. వీలైనంత త్వరగా బొగ్గు ఉత్పత్తి మొదలయ్యేలా కంపెనీలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నాం.అని ఎక్స్‌ప్లోరేషన్ లో ప్రయివేట్ ఏజెన్సీలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం.ఈ సంస్కరణలను మరో అడుగు ముందుకు తీసుకెళ్తూ.. కోల్ ద్వారా సిన్ గ్యాస్ ఉత్పత్తి చేసేందుకు.. కోల్ గ్యాసిఫికేషన్ కు సంపూర్ణ ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం.అని తెలిపారు ఇందుకోసం కేంద్రప్రభుత్వం రూ.46వేల కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తోంది.ఆపరేషన్ సింధూర్ తర్వాత, ఇటీవల నెలకొన్న గ్లోబల్ టెన్షన్స్ నేపథ్యంలో.. మన దేశం ఫర్టిలైజర్స్, గ్యాస్ ఉత్పత్తికోసం ఆత్మనిర్భరత సాధించాలనేది ప్రధానమంత్రి మోదీ గారి ఆలోచన.ఇందుకోసం కోల్ గ్యాసిఫికేషన్ చాలా కీలకం కానుంది.అండర్ గ్రౌండ్ గ్యాసిఫికేషన్, సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్..మన దగ్గర డీప్ సీటెడ్ కోల్ ఎక్కువ.. అందుకే.. దీన్ని వెలికితీయలేని పరిస్థితుల్లో.. అండర్ గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ చేసేందుకు వీలవుతుంది.అమ్మోనియా, మిథనాలు, హైడ్రోజన్, ఫర్టిలైజర్స్, ఫీడ్ స్టాక్స్, కెమికల్స్, పెట్రోకెమికల్స్ వంటి బై ప్రోడక్ట్స్ వస్తాయి.వీటికోసం ప్రస్తుతం మనం దిగుమతులపై ఆధారపడుతున్నాం.ఇందుకోసం పెద్దమొత్తంలో ఖర్చుచేస్తున్నాం.ఈ విషయాల్లో దిగుమతులను తగ్గించుకునేందుకు.. ప్రస్తుతానికి సర్ఫేస్ గ్యాసిఫికేషన్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు ప్రారంభించాం.ఈ నెల 11న హైదరాబాద్ లో కోల్ గ్యాసిఫికేషన్ పై.. రోడ్ షో ఏర్పాటుచేస్తున్నాం.అని గతవారం ఢిల్లీలో రోడ్ షో జరిగింది. వచ్చే వారం ముంబైలోనూ రోడ్ షో నిర్వహించబోతున్నాం.ప్రభుత్వం ఒక్కటే ఈ పనిచేయలేదు కాబట్టి.. ప్రయివేట్ రంగం కూడా.. భాగస్వాములయితేనే విజయం సాధించగలం.అని 4 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షమందికి ఉపాధి, సుమారు 3లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం సేవ్ చేసే దిశగా ముందుకెళ్తున్నాం. ఒక కొత్త సప్లయ్ చైన్ ను స్టార్ట్ చేయబోతున్నాం.స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కూడా.. బొగ్గు తీయడమే తప్ప ఆ గనులను పూడ్చే పని జరగలేదు.పర్యావరణ హితం కోసం మా ప్రభుత్వం.. మైన్ క్లోజర్ యాక్టివిటీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంద ని చాలా ప్రాంతాల్లో రైతుల భూములు తీసుకుంటాం, గ్రామాలకు గ్రామాలను తీసుకుంటాం. బొగ్గు వెలికి తీసిన తర్వాత.. వదిలేస్తాం.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి 147ను బొగ్గు తీసి వదిలేశాం.అని అన్నారు ఈ విషయాన్ని మోదీ గారి దృష్టికి తీసుకెళ్తే.. వారి ఆదేశాలమేరకు.. సమాంతరంగా.. ఈ కోల్ మైన్స్ ను సైంటిఫిక్ మెథడ్ లో మైన్ క్లోజింగ్ యాక్టివిటీ చేస్తున్నాం.2028 నాటికి.. ఈ గనులను మూసివేయాలని నిర్ణయించుకున్నాం.గ్రామ పంచాయతీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆ జిల్లా కలెక్టర్ ను, స్వచ్ఛంద సంస్థలన భాగస్వామ్యం చేస్తూ.. సైంటిఫిక్ పద్ధతిలో మైన్ క్లోజింగ్ కోసం కమిటీలు ఏర్పాటుచేశాం.600 జిల్లాల్లో ఈ కమిటీలు వేశాం.అని చెప్పారు పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉండే విధంగా పనులు చేస్తున్నాం.అని భారతదేశాన్ని విమర్శిస్తున్న వారందరి నోళ్లు మూయించే విధంగా.. ఈ మైన్ క్లోజింగ్ యాక్టివిటీ ఉండబోతోంది.నేను కూడా ఔజూలో ఒక కోల్ బ్లాక్ ను దత్తత తీసుకున్నాను. మా సెక్రటరీ కూడా ఒక మైన్ దత్తత తీసుకున్నారు.ఆ బ్లాక్ సైంటిఫిక్ పద్ధతిలో క్లోజ్ అయ్యేలా బాధ్యత తీసుకుంటాం.మైన్ క్లోజింగ్ లో గిన్నిస్ రికార్డు సాధించాలనేది నా ఆకాంక్ష. దీన్ని సాధించి తీరతాం.అని మైనింగ్ సెక్టార్ ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వమే ఈ బ్లాక్స్ ను అలాట్ చేస్తారు. కొన్ని మేజర్ మినరల్స్ ను మేం ఆక్షన్ ద్వారా అలాట్ చేస్తాం.గత పదేళ్లలో తీసుకున్న నిర్ణయం కారణంగా.. అల్యూమినియంలో ప్రపంచంలో రెండో అతిపెద్ద ప్రొడ్యూసర్ గా ఉన్నాం.స్టీల్ ఉత్పత్తిలోనూ మనం రెండో స్థానంలో ఉన్నాం.అని బైరైటీస్, మైకాలో కీలకంగా ఉన్నాం.జింక్ ఉత్పత్తిలో 3వ స్థానంలో ఉన్నాం.లైమ్ స్టోన్ లోనూ 3వ స్థానంలో ఉన్నాం.బాక్సయిట్ లో 5వ స్థానంలో ఉన్నాం.అని మైనింగ్ సెక్టార్ లో.. క్రిటికల్ మినరల్స్ లో మనం చాలా వెనకబడి ఉన్నాం.మోదీ గారి ఆలోచనల మేరకు.. రూ.32వేల కోట్ల నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభించాం.క్రిటికల్ మినరల్స్ లో ఆత్మనిర్భరత సాధించడం చాలా అవసరం.అని చెప్పారు 20వ శతాబ్దం ఆయిల్ ఎకానమీ అయితే.. 21వ శతాబ్దం క్రిటికల్ మినరల్స్ ఎకానమీ.క్రిటికల్ మినరల్స్ విషయంలో మనం 93% దిగుమతులు చేసుకుంటున్నాం.అని చెప్పారు సెమీకండక్టర్స్ లోనూ, రెన్యూవబుల్ ఎనర్జీ విషయంలో.. డిఫెన్స్ సెక్టార్ లో.. ప్రతిచోటా క్రిటికల్ మినరల్స్ చాలా కీలకం.ఈ విషయంలో మనం క్రిటికల్ మినరల్స్ ఎక్స్ ప్లోరేషన్ పెంచాలి. విదేశాల్లోని క్రిటికల్ మినరల్ బ్లాక్స్ ను అక్వయిర్ చేసుకోవాలనే లక్ష్యంతో 'కాబిల్' అనే పీఎస్‌యూను ఏర్పాటుచేసుకున్నాం.అర్జెంటీనాలో 5 క్రిటికల్ మినరల్ బ్లాక్స్ ను అక్వయిర్ చేశాం. అక్కడ పనులు ప్రారంభం అయ్యాయి.ఎక్స్ ప్లోరేషన్, మైనింగ్, రీసైక్లింగ్, రీసర్చ్ ఁ డెవలప్మెంట్ వంటి సెవన్ పాయింట్ ఫార్ములాతో పనిచేస్తున్నాం.అని తెలిపారు రీసైక్లింగ్ కోసం.. రూ. 1500 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం.ఈ-వేస్ట్ ను సేకరించి.. వాటినుంచి క్రిటికల్ మినరల్స్ తీసే పనిలో ఉన్నాం.క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభించిన 9 నెలల్లో .. ఈ బ్లాక్స్ ఆక్షన్ ను వేగవంతం చేశాం.పాలసీ రిఫామ్స్ తీసుకొచ్చాం. హోల్ ఆఫ్ గవర్నమెంట్ అప్రోచ్ తో.. పనిచేస్తున్నాం.ఒడిశా, ఏపీ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో.. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ కోసం స్పెషల్ మిషన్ ఏర్పాటుచేశాం.అని ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాలు.. క్రిటికల్ మినరల్ ప్రాసెసింగ్ విషయంలో చాలా ప్రొయాక్టివ్ గా పనిచేస్తున్నాయి.24 క్రిటికల్ మినరల్స్ మీద ఇంపోర్ట్ డ్యూటీ మినహాయింపు ఇచ్చాం.ఇలాంటి ఎన్నో సంస్కరణలు తీసుకొస్తున్నాం.విదేశాంగ శాఖ కూడా ఇందులో భాగస్వాములు చేసి.. విదేశాల్లోని క్రిటికల్ మినరల్ బ్లాక్స్ అక్వయిర్ చేసేలా ముందుకెళ్తున్నాం.

ప్రధానమంత్రి గారు గతేడాది కాలంగా ఏ దేశానికి వెళ్లినా.. ఆ దేశంతో క్రిటికల్ మినరల్స్ విషయంలో ఒప్పందాలు చేస్తున్నార ని అన్నారు

మైనింగ్ ద్వారా అందే లాభంలో 90% రాష్ట్రాలకే అందుతుంది.

మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సంక్షేమం కోసం ఐఅర్‌తీఅష్ వీఙఅవతుశ్రీ ఖీశీబఅఝఅశీఅ (ఐవీఖీ) ఏర్పాటుచేశాం.

ఆక్షన్ ప్రీమియం, రాయల్టీ, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ద్వారా వచ్చే నిధులన్నీ రాష్ట్రాలకు రెవెన్యూ పెంచుతాయి.

జీఎస్టీలో ఫైనల్ ప్రొడక్ట్ మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో సగం తీసుకుంటాయి.

మైనింగ్ నుంచి 2% ఐవీఖీలో పెట్టి.. ఆ గని పరిధిలో పర్యావరణం, మౌలికవసతుల కల్పన కోసం ఖర్చుచేసేలా నిబంధనలు రూపొందించాం.

ఐవీఖీ నిధులను రాష్ట్రాలకు ఉద్దేశించిన లక్ష్యాలకోసం వాడాలనేది మా సూచన.

కోకింగ్ కోల్ అనేది హై క్వాలిటీ కోల్. ఆ స్థాయికి మన బొగ్గు రావాలంటే.. కోల్ వాషరీస్ ను ఏర్పాటుచేశాం. దీని ద్వారా మన బొగ్గులోని యాష్ కంటెంట్ ను తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. అని పేర్కొన్నారు

ుబవర్‌అశీఅ ఁ ాూఅంఎవశీం

సింగరేణికి సంబంధించి.. రెండేళ్లలో.. ఖర్చులు తగ్గించే ప్రయత్నం చేశాను.

సింగరేణికి కార్మికులకు న్యాయం చేసే ప్రయత్నం చేశాను.

కోలిండియాతోపాటుగా సింగరేణి ఉద్యోగస్తులకు ఇన్సూరెన్స్ పెంచాం.

గతంలో 30 లక్షలు, 40 లక్షలుండే ప్రమాదబీమాను.. కోటి రూపాయలకు పెంచాం.

ఇవాళ్టి లెక్కల ప్రకారం.. కోటి 25 లక్షల వరకు వారికి ప్రమాదబీమా వస్తుంది.

దీన్ని ఇప్పుడు మోదీ గారు.. అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో దీన్ని అమలు చేస్తున్నార ని అన్నారు

మైన్ క్లోజింగ్ కు ముందు,మైన్ క్లోజింగ్ తర్వాత అనే విషయంలో.. వీడియోస్ సిద్ధం చేసి విడుదల చేస్తాం.

వాటర్ బాడీస్ గా, సోలార్ పార్కులుగా.. చాలా మార్పులు చేస్తున్నాం.

కోల్ గ్యాసిఫికేషన్ లో అనుకున్న లక్షాలను చేరుకుంటాం. 100 మిలియన్ టన్నుల బొగ్గును కేటాయిస్తాం.అని

తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణిలో యాత్ర చేశాను.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. సింగరేణి ఉద్యోగుల ఇన్ కమ్ టాక్స్ మినహాయింపు చేస్తానని భరోసా ఇచ్చాను.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలను అడిగాను. వారు చేయలేదు.

మేం 2028లో అధికారంలోకి రాగానే.. కచ్చితంగా వారికి ఆదాయపుపన్ను మినహాయింపు ఇస్తాం.అని తెలిపారు

ఢిల్లీ నుంచి కోల్ మినిస్ట్రీ అధికారులను సింగరేణికి పెంచి.. ఖర్చు తగ్గించేందుకు ఏం చేయాలనే దానిపై సూచనలు చేశాను. సింగరేణి భవన్ లో.. ఉన్నతాధికారులందరినీ పిలిపించి మాట్లాడాను. కొన్ని సూచనలను అమలు చేస్తున్నాను. ఇంకా చాలా చేయాల్సిన అవసరం ఉంది.

ఓపెన్ క్యాస్ట్ మైనింగ్ ను తగ్గించేందుకు.. అండర్ గ్రౌండ్ మైనింగ్ ను ప్రోత్సహిస్తున్నాం.

కానీ ఇవాళ కోల్ డిమాండ్ ఉంది కాబట్టి.. ఇన్సెంటివ్స్ ఇస్తున్నాం.అని చెప్పారు

ప్రయివేట్ మైనింగ్, కమర్షియల్ మైనింగ్ కారణంగా.. ఉద్యోగాలు పెరుగుతున్నాయి.

కమర్షియల్ మైనింగ్ ద్వారా.. 800 మిలియన్ టన్స్ బొగ్గు ఉత్పత్తి జరగనుంది కాబట్టి దానికి అనుగుణంగా ఉద్యోగాల కల్పన పెరుగుతుంద ని అన్నారు

# హరీష్ రావు మాటలు అన్ని అబద్ధాలే..

- రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత మీకు లేదు..
- రైతన్నలకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది..
- ఇచ్చిన హామీలకు మేము కట్టుబడి ఉన్నాం..
- వరి వేస్తే ఊరే అన్న మీరు రైతుల గురించి మాట్లాడుతున్నారా..
- రైతు పక్షపాతి రేవంత్ రెడ్డి
- కేసీఆర్ కుటుంబం అబద్ధాల మాటల్లో దిట్టా..
- నూటికి నూరు శాతం మళ్ళీ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుంది.. రేవంత్ రెడ్డి గారే ముఖ్యమంత్రి..
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..
- పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు మాట్లాడుతూ.. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న హరీష్ రావు మాట్లాడే మాటలన్నీ అబద్ధాలే అని నిన్న ఆదివారం రోజున పెద్దపల్లి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన



సమావేశంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మాటలను ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు తీవ్రంగా ఖండించారు. అబద్దాలను పదే పది చెప్పి నిజం చేసే దిశగా హరీష్ రావు వ్యవహరిస్తున్నారని వారి కల్లబొల్లి మాటలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు ప్రెస్టేషన్ ఫీల్ అవుతున్నారని గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయకుండా రైతన్నలను బ్యాంకులో డిఫాల్టర్లుగా మిగిల్చారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతన్నలకు వరంగల్ డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి రైతన్నలకు అండగా నిలబడ్డామని గుర్తు చేశారు. గతంలో రైతులకు వరి వేస్తే ఉరే అన్న బిఆర్ఎస్ పార్టీ వారు రైతు సంక్షేమం గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ యాసంగి సీజన్లో కేంద్ర ప్రభుత్వం 51 లక్షల టన్నుల కొనుగోలుకు అనుమతులు ఇస్తే మా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 70 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యాన్ని కొనుగోలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ సీజన్లో రాష్ట్రంలో మొక్కజొన్న పంట అధికంగా పండినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వకపోయినా తమ ప్రభుత్వం సుమారు 3500 కోట్ల బడ్జెట్ కేటాయించి మక్కలను కొనుగోలు చేశామని ఆ డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో జమ చేశామని ఇవన్నీ హరీష్ రావు గారికి కనబడటం లేదా అని విమర్శించారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు గారు ఇక నైనా అబద్దాల మాటలు మానుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రైతు పక్షపాతి అని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ లాగ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేయదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు పండించిన పంటలో గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తున్నామని అలాగే కొనుగోలు చేసిన ధాన్యానికి రెండు రోజుల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ హయంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలో క్వింటాలుకు పది కిలోల వరకు కోతలు విధించి వారి నడ్డి విరిచారని గుర్తు చేశారు. హరీష్ రావు గారు ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే ఉందని అంటుంటే విడ్డూరంగా ఉందని అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎ ఒక్క మంత్రి కూడా కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని గత కొన్ని రోజుల క్రితమే పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దకలవల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్వయంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మరియు మేము అందరూ కలిసి సందర్శించడం జరిగిందని కొనుగోళ్ల గురించి సమీక్షా సమావేశం కూడా నిర్వహించడం జరిగిందని ఇవన్నీ బిఆర్ఎస్ నాయకుల కళ్ళకు కనబడడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ గారు తానే ఇంజనీర్ గా, హరీష్ రావు అసిస్టెంట్ ఇంజనీర్ గా వ్యవహరించి లక్ష కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తే అది చివరికి కూలేశ్వరం అయిందని విమర్శించారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టు గానీ జూరాల ప్రాజెక్టు గానీ కడెం ప్రాజెక్టు గానీ మరియు ఇతర ప్రాజెక్టులు ఇప్పటి వరకు చెక్కు చెదరకుండా ఉన్నాయని ఇవి చాలావ కాంగ్రెస్ పార్టీ నిబద్ధత గురించి అని అన్నారు. ఇకనైనా కేసీఆర్ మరియు వారి కుటుంబ సభ్యులు అబద్దాల మాటలు మానుకొని అవసరమైతే హుందాగా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని సూచనలు చేశారు.ఈ మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు

- పెట్రోల్, డీజల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలి.
- కార్పోరేట్లకు కొమ్ముకాస్తు ప్రజలపై భారాలు
- కూనంనేని సాంబశివరావు

బిజెపి పాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారిందని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు పప్పులు, నూనెలు, కూరగాయల వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చూస్తూ రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఈ నెల 10వ తేదీన నిరసన ధర్నాలు చేపడుతున్నట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. 'అచ్చే దిన్' వస్తాయని చెప్పి, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెడుతున్నారని, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తున్నదని, ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమం చెందిందని సాంబశివరావు పేర్కొన్నారు.

2014 మే నెలలో పెట్రోల్ ధర రూ. 72 వుంటే నేడు 111కు చేరిందని, 55 రూపాయల వున్న డీజిల్ 103కు చెందని వారన్నారు. 2014 మార్చిలో గృహ వినియోగ సబ్సిడీ సిలిండర్ ధర కేవలం రూ. 410.50 గా ఉంటే, గత పదేళ్లలో ప్రభుత్వం సబ్సిడీలను క్రమంగా ఎత్తివేసి, ప్రస్తుతం సాధారణ వినియోగదారులకు సిలిండర్ ధర రూ. 1240 చేరిందని, వాణిజ్య సిలెండర్ ధర రూ. 1600 ఉన్న ధర బిజెపి పాలనలో అది రూ. 3367కు చేరిందని వారన్నారు. రూ.90 ఉన్న వంటనూనె ఇప్పుడు 180కి చేరిందని, ఈ విధంగా రేట్లు పెంచుకుంటూ పోతే సామాన్యుడు జీవించడం కష్టమవతున్నదని వారు తెలిపారు. కార్పోరేట్ కంపెనీలు నష్టపోకుండా రేట్లు పెంచుతున్నారని తెలిపారు. పెంచిన నిత్యావసర, గ్యాస్, పెట్రో ఉత్పత్తుల రేట్లను తగ్గించాలని కలెక్టర్ కార్యాలయాల ముందు జరుగు ఆందోళన కార్యక్రమాలలో ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్దయెత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని సాంబశివరావు కోరారు.

# పెద్ది కలెక్షన్ల సునామీ

## 300 కోట్ల వసూళ్లకు చేరువలో వసూళ్లు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే రికార్డు స్థాయి వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. విడుదలైన మొదటి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఆ తర్వాత రెండో రోజు రూ.46.44 కోట్లు, మూడో రోజు రూ.54.90 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే రూ.236.7 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ఆదివారం కూడా అదే జోరు కొనసాగించిన 'పెద్ది' మొదటి వీకెండ్ ముగిసే సరికి ప్రపంచవ్యాప్తంగా రూ.292.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ, సినిమాను 'బాక్సాఫీస్ ఛాంపియన్'గా అభివర్ణించింది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ చిత్రం అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి కీలక మార్కెట్లలో రామ్ చరణ్‌కు ఉన్న క్రేజ్ మరోసారి ఈ వసూళ్ల ద్వారా స్పష్టమైంది. నాలుగు రోజుల్లోనే దాదాపు రూ.300 కోట్లకు చేరువైన ఈ సినిమా, వీక్‌డేస్‌లో కూడా ఇదే స్థాయిలో కలెక్షన్లు కొనసాగిస్తే త్వరలోనే రూ.500 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో నటించారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలకమైన కోచ్ పాత్రలో కనిపించగా, జగపతిబాబు 'అప్పలసూరి'గా, దివ్యేందు శర్మ మరో ముఖ్యమైన పాత్రలో నటించారు.




## జీ కి దక్కిన వృషకర్మ శాటిలైట్ హక్కులు ?

తండేల్ తర్వాత అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ 'వృషకర్మ' మూవీకి విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నాడు. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లక్కీ భాస్కర్ ఫేం మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది.. 2026 డిసెంబర్‌లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. వృషకర్మ శాటిలైట్‌రైట్స్‌ను పాపులర్ టీవీ ఛానల్ జీ తెలుగు దక్కించుకున్నట్టు సమాచారం. జీ తెలుగు భారీ మొత్తానికి వృషకర్మ శాటిలైట్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయనున్నారట మేకర్స్. వృషకర్మ లో 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనుండటంతో.. ఇంతకీ క్రేజీ యాక్టర్‌ను డైరెక్టర్ కార్తీక్ దండు ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై స్టార్ డైరెక్టర్ సుకుమార్ బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి.లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## రామాయణంలో భాగం కావడం అదృష్టం: కాజల్



సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. 5వేల సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.




## బాలకృష్ణపై భోలా బాలయ్య గీతం విడుదల

పని చేసేవాళ్లని ప్రపంచం ఇష్టపడుతుంది. పని చేయడమన్నా, సమాజ సేవ అన్నా బాలకృష్ణకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది. ఆయన అభిమానులు ఆ విషయాన్నే స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేస్తుండడం అభినందనీయం అన్నారు ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో భోళా బాలయ్య... పాట ఆవిష్కరణ వేడుక జరిగింది. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజుని పురస్కరించుకుని ఆయన వ్యక్తిత్వంపై రూపొందిన గీతమిది. పాట విడుదల అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెరపై మంచి చేసే హీరోని చూసి వెళ్లిపోవడం కాదు. ఆయన చేసిన ఆ మంచిని స్ఫూర్తిగా తీసుకోవాలి. బాలకృష్ణ అభిమానులు ఆ దిశగానే సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. బాలకృష్ణ అంటే ఏమిటో నేను ఇప్పటికే సినిమాలతో చూపించా. ఆయన అభిమానులు ఏటా పుట్టినరోజు వేడుకని ఓ పండుగలా చేసుకుంటారు. భోళా బాలయ్య పాట చాలా బాగుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి.కె.హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు అనంతపురం జగన్, గీత రచయిత దివాకర్ అమిలినేని, గాయకుడు కరీముల్లా, సంగీత దర్శకుడు ఈశ్వర్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

## గీతూమోహన్ దాస్‌కు టాక్సిస్ బృందం విషెస్



యశ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్' ..ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం దర్శకురాలి పుట్టినరోజు సందర్భంగా షూటింగ్‌లో గీతూకు సంబంధించిన బీటీఎస్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. 'గుండెకు హత్తుకునేలా ఉన్న ప్రతి దృశ్యం వెనుక, మాటల కంటే మౌనమే ఎక్కువగా మాట్లాడిన ప్రతి క్షణం వెనుక.. ఆమె ఉంది' అని పేర్కొన్నారు. కియారా అద్వానీ, నయనతార కథానాయికలు.

## హీరోయిన్లను గ్రామరస్‌గా చూపడం అలవాటే

### ఇది టాలీవుడ్‌లోనే తక్కువని చెప్పాలి

### జాన్వీకపూర్ పై ట్రోల్స్‌కు స్పందించిన నిత్యామీనన్





'పెద్ది' సినిమా విడుదలైన తర్వాత జాన్వీ కపూర్ పాత్ర చుట్టూ నెలకొన్న వివాదం ఇంకా చర్చనీయాంశం గానే కొనసాగుతోంది. సినిమాలో హీరోయిన్‌ను మరింత గ్లామరస్‌గా చూపించారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో ఈ అంశం పెద్ద చర్చకు దారి తీసింది. పలువురు నెటిజన్లు, సినీ ప్రముఖులు దర్శకులను ప్రశ్నిస్తుండగా, మరికొందరు జాన్వీ కపూర్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ వివాదంలో ఇప్పటికే నటీమణులు ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి సహా పలువురు హీరోయిన్లు స్పందించి, హీరోయిన్‌లను విమర్శించడం కంటే దర్శకులను ప్రశ్నించాలని అభిప్రాయపడ్డారు.తాజాగా ఈ అంశంపై నటి నిత్యా మీనన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. హీరోయిన్‌లను కేవలం గ్లామర్ కోణంలో చూపించడం ఒక్క తెలుగు సినీ పరిశ్రమకే పరిమితం కాదని, దాదాపు అన్ని చిత్ర పరిశ్రమల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఆమె అన్నారు. హీరోయిన్‌లను గ్లామర్ డాల్స్‌లా చూపించడం టాలీవుడ్‌లోనే ఎక్కువగా జరుగుతుందనడం సరైన అభిప్రాయం కాదు. ప్రతి ఇండస్ట్రీలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. ప్రేక్షకులను ఆకర్షించడానికి గ్లామర్ అవసరమనే భావనతో కొంతమంది దర్శకులు, నిర్మాతలు వ్యవహరిస్తున్నారు. సినిమాలు మరింత కమర్షియల్ అవుతున్న కొద్దీ కొన్ని సందర్భాల్లో హద్దులు దాటే పరిస్థితులు ఏర్పడుతున్నాయని నిత్యా మీనన్ పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో కేవలం దర్శకులనే తప్పుబట్టడం సరైంది కాదని కూడా ఆమె అభిప్రాయపడ్డారు. కొంతమంది హీరోయిన్లు గ్లామర్ పాత్రలను స్వీకరించడానికి సిద్ధంగా ఉంటారు. అదే కారణంగా దర్శకులు కూడా వారిని ఆ కోణంలో చూపిస్తుంటారు. ఇది పూర్తిగా ఒకవైపు జరిగే విషయం కాదు అని అన్నారు. తన వ్యక్తిగత అనుభవాన్ని కూడా నిత్యా ఈ సందర్భంగా పంచుకున్నారు. గతంలో కొందరు దర్శకులు నన్ను పూర్తిగా గ్లామర్ ఆధారిత పాత్రల కోసం సంప్రదించారు. కానీ అలాంటి పాత్రలు చేయడం నాకు ఇష్టం లేక నేను తిరస్కరించాను. దాని వల్ల కొన్ని పెద్ద సినిమాల్లో అవకాశాలు కోల్పోయినా బాధపడలేదు. స్టార్‌డమ్ కంటే నా వ్యక్తిగత విలువలు, నేను నమ్మే సిద్ధాంతాలు నాకు ముఖ్యం అని చెప్పారు. పరిస్థితులు మన అభిరుచికి విరుద్ధంగా ఉన్నప్పుడు 'నో' చెప్పగల ధైర్యం ఉండాలి. కానీ కొందరు హీరోయిన్లు టాప్ హీరోయిన్ కావాలనే లక్ష్యంతో లేదా పెద్ద హీరోల సినిమాల్లో అవకాశం కోసం ప్రాధాన్యత తక్కువగా ఉన్న పాత్రలను కూడా అంగీకరిస్తున్నారు. మొదటి నుంచి గ్లామర్ పాత్రల్లో నటిస్తూ వచ్చి, ఒక్కసారిగా అలాంటి పాత్రలు చేయనని చెప్పితే ప్రేక్షకులు కూడా నమ్మరు. చివరికి ఇది ప్రతి హీరోయిన్ వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది అని నిత్యా మీనన్ వ్యాఖ్యానించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో అర్జీలు స్వీకర్ ఇస్తున్న జాయింట్ కలెక్టర్



**నెల్లూరు, జూన్ 8, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ ,తెలుగు గంగ ప్రత్యేక అధికారి మహేశ్వర రెడ్డి , మెప్మా పి.డి.కిరణ్ కుమార్,ఐటిడిఏ పిఓ శ్రీనివాసరావు ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్ తదితరులు.

## రాష్ట్రంలో జూన్ 8 నుంచి యాప్ ఆధారిత యూరియా, డి.ఏ.పీ విక్రయాలు

- ఎపిఎయిమ్స్ యాప్ ద్వారా విక్రయాలు
- రైతులకు పారదర్శకంగా ఎరువుల సరఫరా
- సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 155251
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, జూన్ 08 : జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
రైతులకు సకాలంలో, పారదర్శకంగా ఎరువుల సరఫరా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జూన్ 8వ తేదీ నుంచి యాప్ ఆధారిత యూరియా, డి.ఏ.పీ విక్రయ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.
రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఎరువుల సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరగడం వల్ల కేటాయించిన యూరియా, డి.ఏ.పీ ఎరువులు అర్హులైన రైతులకు చేరడంతో పాటు విక్రయ ప్రక్రియలో పూర్తి పారదర్శకత నెలకొంటుందన్నారు.
కాకినాడ, కృష్ణా జిల్లాలను మినహాయించి మిగిలిన 26 జిల్లాల్లో ఈ విధానం అమలులోకి వచ్చిందని తెలిపారు.
సాగు చేసే ప్రతి రైతుకు ఎపిఎయిమ్స్ యాప్ ఆధారిత విక్రయ వ్యవస్థ ద్వారా లబ్ధి చేకూరేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.
అదేవిధంగా, ఎరువుల విక్రయాలపై సమగ్ర పర్యవేక్షణ, సరఫరా వ్యవస్థలో పారదర్శకత, నిల్వల నిర్వహణలో సమర్థత పెరుగుతుందని తెలిపారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించడం, అక్రమ నిల్వలు మరియు దుర్వినియోగాన్ని నివారించడంలో ఈ విధానం కీలకంగా ఉపయోగపడుతుందన్నారు.
జిల్లాలోని రైతులు ఎరువుల కొనుగోలు సమయంలో అవసరమైన వివరాలను అందించి యాప్ ఆధారిత విక్రయ విధానానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎరువుల సరఫరా లేదా విక్రయాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 155251 ను సంప్రదించవచ్చని తెలిపారు.
ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు యాత్రికులు మృతి

### నెల్లూరు జిల్లా యాత్రికుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 8, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
మృతుల కుటుంబాలకు× ప్రగాఢ సంతాపం తెలిపిన మంత్రి నారాయణ ప్రమాద వార్తపై తక్షణమే స్పందించిన మంత్రి నారాయణ,బీహార్ అధికారులతో అత్యవసర సంప్రదింపులు
ఈనెల 1న నెల్లూరు జిల్లా నుంచి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయల్దేరిన 40 మంది యాత్రికులు ఆత్మకూరు, దుత్తలూరు, సంగం మండలాలకు చెందిన వారిగా గుర్తింపు వారణాసి వెళ్తుండగా లారీని ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదానికి గురైన యాత్రికుల బస్సు
ప్రమాదంలో ఆత్మకూరుకు చెందిన ఒకరు, సంగం మండలానికి చెందిన ఇద్దరు దుర్మరణం
బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారాయణ భరోసా




## ఊరు వెళ్తున్నారా జర భద్రం

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గ ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జూన్.08.**
కనబడేటట్టు తాళం వేయడం, ఇంట్లో విలువైన వస్తువులు అలాగే వదిలేయడం, సోషల్ మీడియాలో "టూర్" పోస్టులు పెట్టడం ఇవే దొంగలకు ఆహ్వానం.
1000 రూ ఖర్చుతోనే మోషన్ డిటెక్షన్ సీసీ కెమెరా (మీ ఫోన్ కి లైవ్ అలెర్ట్ వస్తుంది) బిగించుకోవచ్చు.లి
నిర్లక్ష్యం తో నష్టపోయే కన్నా – జాగ్రతగా ఉండటం మేలు.
మీ ఇంటి భద్రత మీ చేతుల్లోనే

## ఔరంగాబాద్ ప్రమాద బాధితులను ఆదుకుంటాం : కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



**నెల్లూరు,జూన్ 08 : జనసముద్రం జిల్లా ప్రతినిధి**
బీహార్ లోని ఔరంగాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు మరణించడం, మరో 15 మంది తీవ్రంగా గాయపడిన ఘటన తనను ఎంతగానో కలచివేసిందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత నెల్లూరు పరిసర ప్రాంతాలకు చెందిన 43 మందితో కాశికి ప్రయాణిస్తున్న టూరిస్టు బస్సు,ఔరంగాబాద్ వద్ద లారీని ఢీ కొట్టడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఔరగాబాద్ కలెక్టర్ అభిలాష శర్మతో రామ్మోహన్ నాయుడు చరవాణీ ద్వారా సంప్రదించారు. ఘటన జరగడానికి గల కారణాలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. మెరుగైన వైద్యాన్ని క్షతగాత్రులకు చేరువ చెయ్యాలని, ఇందుకోసం అవసరమైతే విమానయానాన్ని కూడా వాడుకోవాలని సూచించారు. తన వ్యక్తిగత సిబ్బందిని కూడా ఈ ఘటన సహాయక చర్యల్లో భాగస్వామ్యం చేసినట్టు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన రామ్మోహన్ నాయుడు.. క్షతగాత్రులు అంతా ధైర్యంగా ఉండాలని కోరారు.



## కారంపూడిలో ప్రజాదర్భార్

**జనసముద్రంన్యూస్, మాచర్ల నియోజకవర్గం, కారంపూడి, జూన్ 8;**
పల్నాడు జిల్లా కారంపూడి మండల కేంద్రంలోని మండల ఎంఆర్ఓ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ అనగా బుధవారం ఉదయం 10.30 నిమిషాలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో ప్రజాదర్భార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శాసన సభ్యుల వారి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కావున మండల ప్రజలు సమయపాలన పాటించి, వ్యక్తిగత ఆధార్ జిరాక్స్ తో హాజరై, సమస్యలను అర్జీల రూపంలో సమర్పించాలని పేర్కొంది.

## బొర్రా జంక్షన్అనంతగిరి రహదారిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలి

### జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి

**అనంతగిరి, జనసముద్రం న్యూస్ జూన్ 09:**
అనంతగిరి మండలంలోని బొర్రా జంక్షన్ నుండి అనంతగిరి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ఉన్న ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తొలగించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు చిట్టం మురళి విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ (AE) శ్రీనివాస్ రావుకు వినతిపత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా చిట్టం మురళి మాట్లాడుతూ, బొర్రా జంక్షన్ నుండి అనంతగిరి వరకు ఉన్న ఈ రహదారి గిరిజన ప్రాంత ప్రజలకు అత్యంత కీలకమైన మార్గమని పేర్కొన్నారు. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు ఈ రహదారిపై ప్రయాణిస్తుండటంతో పాటు అరకు ప్రాంతానికి వచ్చే పర్యాటకులు కూడా ఇదే మార్గాన్ని అధికంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు.
ప్రత్యేకంగా ఈ రహదారిలో అనేక ప్రమాదకర



మలుపులు ఉండటంతో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు రహదారికి అత్యంత సమీపంలో ఉండటం వల్ల ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వ్యక్తం చేశారు. వాహనాలు అదుపు తప్పిన సందర్భాల్లో ఈ స్తంభాలుప్రాణాంతక ప్రమాదాలకు దారితీయవచ్చని హెచ్చరించారు.
ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్థల పరిశీలన చేపట్టి, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి రహదారికి దూరంగా సురక్షిత ప్రాంతాలకు మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.
గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ప్రజల భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను మురళి కోరారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రహదారులపై భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు.
అనంతగిరి మండల ప్రజల తరపున ఈ సమస్యను విద్యుత్ శాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు చిట్టం మురళి తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన ఈ అంశాన్ని అధికారులు అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విద్యాభ్యాసంలో ప్రతిభా చాటిన విద్యార్థిని అర్చన

- విద్యతోనే పేదరికం దూరం.
- విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవటానికి సాధ్యం.
-968 మార్కులు సాధించిన అర్చనకు అవార్డు ప్రధానం.



**కుందుర్పి జూన్, 08, జనసముద్రం న్యూస్ :**
మండల పరిధిలోని కెంచంపల్లి గ్రామానికి చెందిన గురుమూర్తి వైఫ్ ఆఫ్ శివమ్మ కుమార్తె అర్చన 7/6/2026 ఆదివారం రోజున సత్యసాయి జిల్లా అమరాపురం మండలం లో అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అర్చన ప్రతిభతో అర్చన ప్రశంసలు అందుకుంది.
అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన ఆమె ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో1000/ 968 మార్కులు సాధించింది.
అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన అర్చనకు అవార్డు ప్రదానం చేశారు.
ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు.
అర్చన తల్లిదండ్రులు సి. శివమ్మ, సి. గురుమూర్తి.
కుమార్తె సాధించిన విజయంపై వారు ఆనందం వ్యక్తం చేశారు.
గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం విశేషమని పలువురు పేర్కొన్నారు.
చదువుపై అంకితభావం, క్రమశిక్షణతో అర్చన ఈ ఫలితాన్ని సాధించిందని ఉపాధ్యాయులు తెలిపారు.
పాఠశాల అధ్యాపకుల మార్గదర్శకత్వం తన విజయానికి ఎంతో దోహదపడిందని అర్చన పేర్కొంది.
తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తనకు బలంగా నిలిచిందని చెప్పింది.
అర్చన సాధించిన 968 మార్కులు ఎంతో గొప్ప విజయమని వారు కొనియాడారు.
ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని అన్నారు.
అవార్డు అందుకున్న సందర్భంగా అర్చనను ఘనంగా ప్రశంసించి
పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.
కార్యక్రమంలో పాల్గొన్న వారు అర్చన భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.
ఆమె మరింత ఉన్నత చదువులు అభ్యసించి గొప్ప స్థాయికి చేరుకోవాలని సూచించారు.
విద్యార్థులు అర్చనను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.
కష్టపడి చదివితే విజయం సాధించడం కష్టమేమీ కాదని అన్నారు.
అర్చనవిజయంతోకుటుంబసభ్యులుఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.
బంధువులు, స్నేహితులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.
గ్రామ ప్రజలు కూడా ఆమెను అభినందించారు.
అమరాపురం మండలానికి చెందిన విద్యార్థిని ఈ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు.
అంబేద్కర్ గురుకుల విద్యాసంస్థల నుంచి అనేక మంది విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు.
అర్చనకూడాఅదేసంప్రదాయాన్నికొనసాగించిందన్నారు.
విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె నిరూపించిందన్నారు.
పేద, మధ్యతరగతి విద్యార్థులకు అర్చన ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.
విద్యార్థుల కృషికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యతోనే పేదరికం దూరం అని తెలిపారు.
ఈ సందర్భంగా అర్చన తన విజయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అంకితం చేసింది.
తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపింది.
భవిష్యత్తులో మరింత కష్టపడి చదువుతానని చెప్పింది.
ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొంది.
సమాజానికి ఉపయోగపడే స్థాయికి చేరుకోవడమే తన ఆశయమని తెలిపింది.
అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని అర్చన అభిప్రాయపడింది.
ఇలాంటి గుర్తింపులు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని చెప్పింది.
తన విజయానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపింది.
కార్యక్రమం అనంతరం అర్చనతో పలువురు ఫోటోలు దిగారు.
ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు అందజేశారు.
మొత్తంగా 968 మార్కులు సాధించి అవార్డు అందుకున్న అర్చన విజయం అమరాపురం మండలానికి, ఆమె కుటుంబానికి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.
ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.
అర్చన వంటి ప్రతిభావంతులైన విద్యార్థులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.
విద్యార్థులు లక్ష్యసాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.
అర్చన విజయగాథ మరెందరికో మార్గదర్శకంగా నిలవనుందిఆ అని తెలిపారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

- జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు
- రామతీర్థం సాగర తీరంలో సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన

**నెల్లూరు, జూన్ 8 : జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
యోగా ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.
అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా విడవలూరు మండలం రామతీర్థం సాగర తీరం వద్ద ఆదివారం నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ప్రకృతి సోయగాల నడుమ, అలల సవ్వడుల మధ్య యోగా ఔన్నత్యం ఉట్టిపడేలా నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. అందమైన సాగర తీరం, ఆహ్లాదకరమైన వాతావరణంలో జాయింట్ కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, యోగా సాధకులు, ప్రజలు సామూహికంగా యోగాసనాలు నిర్వహించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో ఏర్పడుతున్న అనారోగ్య సమస్యలను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే గొప్ప సాధనం యోగా అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.
యోగాసనాల ప్రాముఖ్యత వివరించిన యోగా గురువులు యోగా గురువులు డా. స్వప్న, జయంతి, యోషిత యోగాలోని ప్రతి ఆసనం ప్రాముఖ్యత, వాటి ఆరోగ్య ప్రయోజనాలను వివరంగా తెలియజేస్తూ యోగాసనాలు చేయించారు. యోగా ద్వారా శారీరక సామర్థ్యం పెరగడంతో పాటు మానసికఒత్తిడితగ్గిజీవననాణ్యత మెరుగుపడుతుందని వివరించారు.
ప్రకృతి ఒడిలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమం పాల్గొన్న వారిలో నూతన ఉత్సాహాన్ని నింపింది. సముద్ర అలల హోరు, స్వచ్ఛమైన గాలి మధ్య యోగాసనాలు వేయడం ద్వారా ప్రత్యేక అనుభూతిని పొందామని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం యోగా పట్ల ప్రజల్లో మరింత అవగాహన, ఆసక్తిని పెంపొందించింది.
యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయాలనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర-2026కార్యక్రమాలుఉత్సాహంగాకొనసాగుతున్నాయి . అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో యోగా పట్ల చైతన్యం కల్పిస్తున్నారు.
ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, ఐటిడిఏ పీఓ శ్రీనివాసరావు, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు, జిల్లా పర్యటక శాఖ అధికారి ఎస్.కె హాజర్ అలీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, మత్స్యశాఖ అధికారి చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగిన తీరును యాజమాన్యం ను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి



**జనసముద్రంన్యూస్,మాచర్ల, జూన్ 8;**
పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని రామాటాకీస్ థియేటర్ నందు ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంపై మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విచారం వ్యక్తం చేస్తూ.. ప్రమాదం జరిగిన తీరును యాజమాన్యాన్ని అడిగి తెలుసుకుని,వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మ జన్మనిస్తే.. హెల్మెట్ పునర్జన్మ నిస్తుంది: మాచర్ల సీఐ నజీర్ బేగ్ భావోద్వేగ పిలుపు



**జనసముద్రంన్యూస్, మాచర్ల, పల్నాడు జిల్లా, జూన్ 8;**
వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా సరే చట్టపరమైన చర్యలు తప్పవని మాచర్ల టౌన్ సీఐ మహమ్మద్ నజీర్ బేగ్ స్పష్టం చేశారు.
పట్టణంలోని ప్రముఖ కూడలి అయిన పార్క్ సెంటర్ వద్ద ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ వాహనదారులకు, వ్యాపారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. తోపుడు బండ్ల వ్యాపారులు, పలువురు దుకాణదారులు రోడ్లపై ఇష్టానుసారంగా సామాగ్రిని ఉంచి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే సహించేది లేదన్నారు. నిబంధనలు మీరి రోడ్లను ఆక్రమించే వారిపై, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థను సజావుగా సాగించేందుకు మరియు ప్రమాదాల నివారణకు ప్రజలు, వ్యాపారస్తులు అందరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## బీహార్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి




**నెల్లూరు, జూన్ 8, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికుల మృతిపై జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.కిరణ్ కుమార్ రెడ్డితీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సంగం మండలానికి చెందిన ఇద్దరు, నెల్లూరు నగరానికి చెందిన ఒకరు మొత్తం ముగ్గురు భక్తులు మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు.
ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం ప్రాంతం నుంచి 43 మంది యాత్రికులతో గయా, వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురై ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు.మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన కిరణ్ కుమార్ రెడ్డి , ఈ దుర్ఘటన బాధిత కుటుంబాలకు తీరని లోటన్నారు.ప్రమాదంలో గాయపడిన యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన, వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా అధికార యంత్రాంగం ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తిగా అండగా ఉంటామన్నారు.

## భగభగలాడే ఎండల్లోనూ శ్రీ వేంకటేశ్వరునికి భక్తుల తాకిడి



**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గ ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జూన్.08.**
భగభగలాడే ఎండలో సైతం మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు బారులు తీరారు. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు.
ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. ఎండల్లో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా వేడిమి నుంచి కాపాడేందుకు క్యూలైనుల్లో అడుగడుగునా తాగునీరు, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.

## వైభవోపేతంగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ.





**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జూన్.08.**
భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ ఊంజల సేవను వైభవోపేతంగా చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.

## బీహార్ రోడ్డు ప్రమాద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు

- **మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**
- **సీఎంవో కార్యాలయం, ఢిల్లీ ఆంధ్ర భవన్, బీహార్ అధికారుల సమన్వయంతో బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నాం : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.**
- **ముఖ్యమంత్రి ఆదేశాలతో మృతదేహాల తరలింపునకు ప్రత్యేక విమానం**
- **క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు**
- **బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి ఆనం**



**నెల్లూరు, జూన్ 8 : జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని, బాధితులకు సత్వర సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.
నెల్లూరుసంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గయా నుంచి వారణాసికి వెళ్తున్న యాత్రికుల బస్సు ఔరంగాబాద్ సమీపంలో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ బస్సులో సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్నారని,ఉదయం5 గంటల సమయంలో ప్రమాద సమాచారం తనకు అందిందని చెప్పారు.
బస్సులో మొత్తం 45 మంది ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఒక వంటమనిషి, 42 మంది యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని వెల్లడించారు. మృతి చెందిన వారిలో టూర్ అటెండెంట్, వంటమనిషి, ఒక మహిళా యాత్రికురాలు ఉన్నారని చెప్పారు.
సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయం, ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘటనపై వెంటనే స్పందించి బాధితులకు అత్యవసర సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు.

**ప్రత్యేక విమానంలో మృతదేహాల తరలింపు**
గయా నుంచి నెల్లూరు జిల్లాకు రోడ్డు మార్గంలో రావడానికి 38 గంటలకు పైగా సమయం పడుతుందని, ఈ నేపథ్యంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. అక్కడి నుంచి జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**క్షతగాత్రులకు వైద్య సేవలు**
ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులకు గయాలోని మెడికల్ కాలేజీలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులను కూడా ప్రత్యేక విమానంలో చెన్నైకి తీసుకువచ్చి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా అధికారుల సహకారంతో నెల్లూరు జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు, నిరంతర పర్యవేక్షణ**
ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి బీహార్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్ ఆధ్యా శ్రీకాంత్ బీహార్ ప్రభుత్వ అధికారులతో, సీఎంవో అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు.

**తెలుగు అధికారుల సహకారంతో ఘటనా స్థలంలో సహాయక చర్యలు**
బీహార్‌లో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి డా. రాజేందర్ కుమార్, ఐపీఎస్ అధికారి వివేక్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని మంత్రి వెల్లడించారు.

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**
ఈ ప్రమాదంలో మొత్తం ముగ్గురు భక్తులు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు నుంచి ఈనెల 1న ప్రైవేట్ బస్సు లో గయా, వారణాసి యాత్రకు వెళ్లిన భక్తులు ప్రమాదానికి గురికావడం తీవ్ర విచారం కలిగించిందన్నారు.
మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

**ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది**
ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ముగిసిన అనంతరం పరిహారం అంశంపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందన్నారు.
దూర ప్రాంతంలో జరిగిన ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర వేదనలో ఉన్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం పొందాలని ఆకాంక్షించారు.

## ప్రకృతి ఒడిలో.. అలల జడిలో,యోగాసనాలు







**నెల్లూరు, జూన్ 8, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా విడవలూరు మండలం రామతీర్థం సాగర తీరం వద్ద నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన
ప్రకృతి సోయగాల నడుమ, అలల సవ్వడుల మధ్య యోగా ఔన్నత్యం ఉట్టిపడేలా ప్రత్యేక యోగా కార్యక్రమం అందమైన సాగర తీరం, ఆహ్లాదకరమైన వాతావరణంలో సామూహికంగా యోగాసనాలు చేసిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, యోగా సాధకులు, ప్రజలు
యోగా ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పేర్కొన్న జాయింట్ కలెక్టర్
యోగాలోని ప్రతి ఆసనం ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలను వివరంగా తెలియజేస్తూ యోగాసనాలు చేయించిన యోగా గురువు డా.స్వప్న, జయంతి, యోషిత..
ప్రకృతి ఒడిలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమం పాల్గొన్న వారిలో నూతన ఉత్సాహాన్ని నింపగా,యోగాపట్లమరింత ఆసక్తిని పెంపొందించిన వైనం యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయాలనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాలు

## అర్బన్ సొసైటీ చైర్మన్ గా వలవల రవికుమార్ ప్రమాణస్వీకారం సొసైటీ చైర్మన్ రవికుమార్ కు శుభాకాంక్షలు వెల్లువ







**నరసాపురం జూన్ 8 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**
నరసాపురం కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ (బ్యాంక్) లిమిటెడ్ నూతన చైర్మన్ మరియు పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ మరియు కూటమి నాయకులు సమక్షంలో ఘనంగా నిర్వహించబడింది.
ఈ సందర్భంగా నూతనంగా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వలవల రవి కుమార్ (నాని), అలాగే పాలకవర్గ సభ్యులు(డైరెక్టర్లు) సమతం వీర కోట నాగ వెంకటేశ్వర రావు, మాధుం కనక శ్రీనివాస్, మహమ్మద్ సలీమ్, అప్పన నాగ వెంకట, వనమ రాజ్ కుమార్, తిరుమాని శ్రీరామ రాజు, రావూరి వెంకట సత్యనారాయణ, పాలూరి విఘ్నేశ్వర వర ప్రసాద్, తుమ్మలపల్లి లక్ష్మీ నారాయణ, కొరాడ వెంకట పాపారావు, కడిమి ప్రవీణ్ కుమార్, నాత్ర నరేష్ కుమార్ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
నరసాపురం కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తూ, సభ్యుల సంక్షేమం మరియు సంస్థ అభివృద్ధి కోసం నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేసి సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆకాంక్షించారు.
అనంతరం వలవల నాని మీడియాతో మాట్లాడుతూ నరసాపురం అర్బన్ సొసైటీ చైర్మన్ గా స్థానిక ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ నాకు అప్పగించిన బాధ్యతను అంతఃకరణ శుద్ధితో సమిష్టిగా సంఘ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కొత్తపల్లి జానకిరామ్, టీడీపీ పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, జనసేన సీనియర్ నాయకులు బొమ్మిడి సునీల్ నాయకర్, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొవ్వాడ రవీంద్రనాథ్ ఠాగూర్, జిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, జనసేన పార్టీ నాయకులు వర్ధనపు ప్రసాద్, జిల్లా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ గుబ్బల మార్రాజు, నిప్పులేటి తారక రామారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ దేశినీడి గంగాధర్, పోలిశెట్టి శ్రీనివాస్, వాతాడి కనకరాజు, ఆకన చంద్రశేఖర్, కొల్లాటి గోపీకృష్ణ, గుబ్బల నాగరాజు, దొండపాటి స్వాములు, గంటా కృష్ణతో పాటు జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి - పలివెల డిమాండ్

**తూర్పుగోదావరి/సీతానగరం/ జూన్ 08/ జనసముద్రం న్యూస్ :**

మండలంలోని ప్రభుత్వ మిగులు భూములను వెంటనే పేదలకు, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మరియు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలని సిపిఐ (ఎంఎల్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లంకూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, అక్కడ నుండి సీతానగరం మండల కేంద్రం కార్యాలయం వరకు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈసందర్భంగా వీరబాబు మాట్లాడుతూ మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా, పేదలకు కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థుల ఫీజులను తగ్గించాలని కోరారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో భూముల్లో ఎర్రజెండాలు పాతి పేదలకు పంచుతామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు.

ఈ ర్యాలీలో పార్టీ నాయకులు పలివెల లోకేష్, కండెల్లి ఏసుబాబు, కురుకూరి కృపమ్మ, తవిటికి సునీత, పలివెల జ్యోతి, నందమూరి చిట్టిస్వామి, డొల్ల పాపారావు, వరదా దుర్గాప్రసాద్, సిద్దే నాగరాజు, వేటూరి నానాజీ తదితరులు పాల్గొన్నారు.





# తహసిల్దార్ కార్యాలయం లో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జూలకంటి

**జనసముద్రంన్యూస్, మాచర్ల, పల్నాడు జిల్లా, జూన్ 8 :**

మాచర్ల పట్టణంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిధిలోని ముత్యాలంపాడు గ్రామ రైతులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతులు మీదుగా నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఆ తరువాత వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు నివేశ స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం కూడా జరిగింది.

ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.





# పిజిఆర్ఎస్ కు రెండు అర్జీలు

**తూర్పుగోదావరి/ సీతానగరం/ జూన్ 08/ జనసముద్రం న్యూస్ :**

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు అర్జీలు అందినట్లు ఎంపీడీవో ఎం భారతి తెలిపారు.

ఆమె తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రపురం గ్రామానికి చెందిన కలగర బాలకృష్ణ చిన్నకొండేపూడి గ్రామ పరిధిలో గల వ్యవసాయ భూమి నందు తొర్రిగడ్డకు సంబంధించిన పైప్ లైన్ పాడైన కారణంగా పంట నష్టం జరిగే అవకాశం ఉందని దాన్ని సరి చేయాలని కోరగా, ఇనుగంటి వారి పేట గ్రామానికి చెందిన గెడ్డం శేషయ్య ముగ్గుళ్ళ గ్రామ సమీపంలో ఒకటో వార్డు నందు ఉన్న డ్రైనేజ్ లైన్ కారణంగా వ్యవసాయ భూమి పాడవుతుందని దాన్ని సరిచేయాలని కోరుతూ అర్జీ అందించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది, తదిరులు పాల్గొన్నారు.

# నిద్రమత్తు వదిలించి.. ప్రాణాలు నిలిపి..!

## - రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలో 'స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో..'









**జనసముద్రం న్యూస్, మదనపల్లి , జూన్ 08:**

అర్ధరాత్రి వేళ ప్రయాణాల్లో డ్రైవర్లను ఆవరించే నిద్రమత్తే ఎన్నో రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం. ఈ ముప్పును నివారించి, వాహనదారులు, ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా రహదారులపై "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో.." (ఆగు, ముఖం కడుక్కో, వెళ్లు) కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ యంత్రాంగం రాత్రి వేళల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది. అర్ధరాత్రి దాటిన తర్వాత రహదారులపై వెళ్లే లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు తదితర వాహనాలను పోలీసులు ఆపుతున్నారు. డ్రైవర్లకు ఏమాత్రం నిద్రమత్తు ఆవహించినట్లు కనిపించినా, వెంటనే వారితో చల్లటి నీళ్లతో ముఖం కడిగిస్తున్నారు. నిద్రమత్తు పూర్తిగా వదిలిన తర్వాతే వారిని ముందుకు సాగేలా అనుమతిస్తున్నారు. రాత్రి సమయాల్లో డ్రైవింగ్ చేసేటప్పుడు ఎదురయ్యే అలసటను పారద్రోలి వారిని అప్రమత్తం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా వాహన చోదకులకు పోలీసు అధికారులు పలు కీలక సూచనలు చేస్తున్నారు. స్టీరింగ్ పట్టిన ప్రతిసారీ ఇంట్లో తమ కోసం ఆశగా ఎదురుచూసే కుటుంబ సభ్యులను గుర్తుచేసుకోవాలని, ఏమరుపాటుతో వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, ఒక బాధ్యతాయుతమైన మిత్రుడిలా జిల్లా పోలీసులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం వాహనదారుల్లో చైతన్యం నింపుతోంది.

# గోపాలపురం సమగ్రాభివృద్ధే ధ్యేయం..

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 8 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

గోపాలపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకట రాజు సోమవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన నియోజకవర్గంలోని పలు కీలక సమస్యలను మరియు అభివృద్ధి పనుల ఆవశ్యకతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులకు విలువ పెరగడమే కాకుండా ఉపాధి లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు నల్లజర్ల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తో పాటు ట్రామా కేర్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కలెక్టర్‌ను కోరారు.రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ఘాట్‌ల అభివృద్ధి, రహదారుల విస్తరణ మరియు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు తగిన నిధులు మంజూరు చేయాలని అన్నారు.ప్రజా సంక్షేమం మరియు ప్రాంతీయ అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే చూపుతున్న చొరవపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజ్ఞప్తులపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఆల్ ఇండియా రేడియో చిత్ర లేఖన పోటీల్లో ప్రతిభను ప్రదర్శించినా గొలగాని యశ్మిత

**జనసముద్రం న్యూస్,సిరిపురం,విశాఖపట్నం,జూన్9,**

ఆల్ ఇండియా రేడియో (AIR) 90 వసంతాల వేడుకలు సందర్భంగా పిల్లల ప్రతిభ గురించి ప్రోత్సహించారు. వేదిక ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం ప్రాంగణం సిరిపురం వద్ద జరిగింది. తేది 26 మే 26 నిర్వహించిన పోటీల్లో గొలగాని యష్మిత నైన్త్ క్లాస్ చదువుతుంది ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. భారతదేశపు జాతీయ ప్రజా ప్రసార సంస్థ. అవతరణ 1936లో "ఆల్ ఇండియా రేడియో"గా అధికారికంగా స్థాపించబడింది.మొదటి ప్రసారాలు: భారతదేశంలో రేడియో ప్రసారాలు అంతకంటే ముందుగానే, 1927లో ప్రైవేట్ సంస్థల ద్వారా ముంబై మరియు కలకత్తాలో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత 1930లో ప్రభుత్వం వీటిని స్వాధీనం చేసుకుని, 'ఇండియన్ స్టేట్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్'గా మార్చింది. దీనినే 1936లో 'ఆల్ ఇండియా రేడియో'గా పేరు మార్చారు.ఆకాశవాణి నామకరణం: ఆల్ ఇండియా రేడియో పేరును 1956లో ఆకాశవాణి గా మార్చారు. పిల్లలు ప్రతిభను గుర్తించి ఆకాశవాణి వారికి జివియంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు నేతలు గొలగాని అప్పారావు అభినందనలు తెలియజేశారు.





PRASAR BHARATI
India's Public Service Broadcaster
AKASHVANI
Visakhapatnam - 530003
E-mail: airpcvsp@gmail.com , airvisakhapatnam@rediffmail.com

RESULTS OF ELOCUTION COMPETITION CONDUCTED ON 26-05-26.

FIRST PRIZE : GOLGANI YASHMITHA
SECOND PRIZE : BODDETI HIMA SRI VARSHINI
THRID PRIZE : S RAGHURAM
CONSOLATION PRIZES : 1. THATISETTI KARTHIKEYA
2. P SWATHI

RESULTS OF DRAWING&PAINTING COMPETITION CONDUCTED ON 26-05-26.

CATEGORY - A (8 to 9 Years):
FIRST PRIZE : KOTA THANVI
SECOND PRIZE : S RISHIKA
THRID PRIZE : D BHAVYA SRI
CONSOLATION PRIZES : 1. B DHANA SRI
2. M SHARMILA

RESULTS OF DRAWING&PAINTING COMPETITION CONDUCTED ON 26-05-26.

CATEGORY - B (10 to 11 Years):
FIRST PRIZE : G BHUVANA RAJESHWARI
SECOND PRIZE : KYATHI VOMMI
THRID PRIZE : P.KAVEESHA DURGA
CONSOLATION PRIZES : 1.CHINTALA GREESHMA SRI
2.LENKA NIKHIL SAI GANESH

# చిన్న వెంకన్న హుండీ లెక్కింపు.

## భారీగా పెరిగిన ఆదాయం రూ. 2.42 కోట్లు.



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 8 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం అధిక మొత్తంలో లభించింది.హుండీల ఆదాయాన్ని ఆలయ అధికారులు ప్రమోద కళ్యాణ మండపంలో అత్యంత భారీ భద్రత ఏర్పాట్లు నడుమ ఆలయ అధికారులు హుండీలను సోమవారం తెరిచి లెక్కించారు. గడిచిన 18 రోజులకు రూ.2,42,55,625/- బంగారం 0.191 గ్రాములు, వెండి 3.274 కేజీలు శ్రీవారి కానుకలుగా వచ్చాయన్నారు. చెల్లని పాత రూ. 1000/-(1)పాత రూ.500 (14 నోట్లు) చెల్లని రూ. 8,000/-

నోట్లతో పాటు 11 పలు విదేశీ కరెన్సీలు వచ్చాయని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్ వి .చందన ,ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ సిబ్బంది , ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, పోలీస్ సిబ్బంది,సేవాదళం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ మ్యాపింగ్ పై అప్రమత్తంగా ఉండాలి

## మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి







**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జూన్ 8**

ఓటర్ మ్యాపింగ్ లో అప్రమత్తంగా ఉండాలని తెలుగుదేశం భూత్ ఇన్చార్జులు, క్లస్టర్లు, బి ఎల్ ఏ లను ఉద్దేశించి సోమవారం నిర్వహించిన స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ర్) శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యోజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నాడు సోమవారశీ ఉదయం:9:00 గంటలకు కుర్నూతుల మర్రిచెట్టు దగ్గర మండల అధ్యక్షుడు యనమల మదన్ మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ర్ ) శిక్షణ తరగతులకు నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి హాజరై టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు క్లస్టర్ మరియు యూనిట్ ఇన్చార్జిలకు, బూత్ కన్వీనర్లకు, బి ఎల్ ఏ లకు. శిక్షణ ఇవ్వడం జరిగిందిలి

డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారు మాట్లాడుతూ... ప్రభుత్వం నియమించిన బి ఎల్ వో లు చేస్తున్న ఓటర్ మ్యాపింగ్ ను ప్రతి ఒక్క ఓటరు మ్యాపింగ్ చేయించుకోవాలని చెప్పడం జరిగింది, ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ ఓటర్ మ్యాపింగ్ ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చెప్పడం జరిగింది. అలా చేసుకోని పక్షంలో ఓటు తొలిగిపోయే ప్రమాదం ఉంది కాబట్టి ప్రతి ఒక్కరూ ఓటర్ మ్యాపింగ్ చేయించుకోవాలని దిశా నిర్దేశం చేయడం జరిగింది

ప్రభుత్వం నియమించిన బిఎల్ఓ లు ఈనెల 15 నుండి డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.కాబట్టి ఈ డోర్ టు డోర్ కార్యక్రమంలో పార్టీ నియమించిన బిఎల్ఎలు తప్పనిసరిగా పాల్గొనాలని డాక్టర్ మండిపల్లె లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారు తెలియజేయడం జరిగిందిలి

అలాగే దొంగ ఓటర్లకు ఎటువంటి అవకాశం లేకుండా చూసుకోవాలని, కొత్త ఓటర్లను చేర్చాలన్న, దొంగ ఓటర్లను మరియు డబుల్ ఎంట్రీ ఓటర్లను తొలగించాలన్న, బిఎల్ఓ లకు ఇన్ఫామ్ చేయాలని, బి ఎల్ ఏ లకు దిశా నిర్దేశం చేయడం జరిగిందిలి.

ఈ కార్యక్రమానికి అసెంబ్లీ కోఆర్డినేటర్ హరి యాదవ్,మార్కెట్ యార్డు చైర్మన్ డాక్టర్ షఫీ నాయక్ క్లస్టర్ కన్వీనర్ శంఖారపు జయరాం , మద్దిరేవుల సింగిల్ విండో అధ్యక్షుడు బత్తిన దేవేందర్ రెడ్డి , మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి , గంగమ్మ ఆలయ చైర్మన్సోడి వెంకటేశ్వర్లు యాదవ్, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్కిరెడ్డిపల్లి ఓబులేసు,మైనార్టీ నాయకుడు ఆరిఫ్ ,సిద్ధక వెంకటరామిరెడ్డి, క్లస్టర్ కో కన్వీనర్ బోనాల ధనంజయ,సర్పంచులు లక్ష్మీనారాయణ, కేశవయ్య, జనార్దన్ రెడ్డి,యాగంటి సుధీర్, మండ్ల రామాంజనేయులు, బాలే పెద్ద రెడ్డియ్య యాదవ్,కొత్తపల్లి యోగాంజనేయులు, భాస్కర్ రెడ్డి, మురికి నాటి వెంకటరమణ, మండల రామాంజనేయులు, మల్లీ,యోగంజిల్ రెడ్డి, డీలర్ అన్వర్ భాష, ముక్తార్ అహ్మద్, ప్రతాపరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు పకీరయ్య, ధర్మారెడ్డి, రౌతు శివశంకర్,దండేశ్రీనివాసులు,కావలి ఆంజనేయులు, చింతకుంటపల్లి బాబు,వెంకటనారాయణ, కొండూరు వెంకటరామరాజు, రెడ్డప్ప రెడ్డి, కిరణ్,పార్లమెంట్ అధికార ప్రతినిధి రమ్య రాయల్, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆదిమూలం పూజ, కట్టమీద ఆంజనేయులు, ఎర్రం రెడ్డి, ఆంజనేయులు,సుంకర వెంకటరమణ, గంట వెంకటకృష్ణ, యనమల విశ్వనాథ్, జానకిడు బాలు, తుమ్మల శ్రీధర్ టిడిపి నాయకులు, కార్యకర్తలు,యూనిట్ మరియు బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వెంకన్న నిత్యాన్నదానానికి విరాళం.



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 8 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి సోమవారం ద్వారకాతిరుమల వాస్తవ్యులు విజ్జురోతి మాధవ మణికంఠ వెంకట నాగ సాయి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దేవస్థానం ఈవో వేంద్ర త్రినాధరావు దాతలను అభినందించి, స్వామివారి ప్రసాదాలను,నిత్యాన్నదానబ్రాండ్‌పత్రాన్ని అందజేశారు.

# స్వచ్ఛ రథం కార్యక్రమానికి ప్రజల విశేష స్పందన

**మొగల్తూరు జూన్ 08 జనసముద్రం**
**పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని రామన్నపాలెం గ్రామపంచాయతీలో సోమవారం స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎంపీడీవో సి.హెచ్. త్రిశూలపాణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇళ్ల నుంచి ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు ఇతర పునర్వినియోగ వ్యర్థ పదార్థాలను సేకరించారు. సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలకు బదులుగా ప్రజలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ విధానం ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత పెంపొందడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన




కల్పించడం లక్ష్యంగా అధికారులు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అధికారులు సూచించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువత మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. స్వచ్ఛ రథం కార్యక్రమం గ్రామంలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకువస్తోందని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# బిజెపి సీనియర్ కార్యకర్త మరణం.

**- సంతాపం తెలియజేసిన బిజెపి జిల్లా ధార్మిక కన్వీనర్ వాడపల్లి లక్ష్మణాచార్యులు.**
**- వారి కుటుంబానికి చిరు సహాయం చేసిన కుక్కునూరు మండలం బిజెపి నాయకులు.**

**కుక్కునూరు ది. 8 జూన్ 2026**
**జనసముద్రం ప్రతినిధి మణికంఠ**

బిజెపి పార్టీలో సుమారు 30 సంవత్సరాలు పాటు పార్టీ అభివృద్ధి కొరకు, పార్టీ బలోపేతానికి నిర్విరామంగా కృషిచేసిన బిజెపి సీనియర్ నాయకులు కేసు పాక శ్రీనివాసరావు గారు ఇటీవల అనారోగ్య కారణంతో మరణించారు. వారు పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి కుక్కునూరు మండలంలో పార్టీలో కీలకపాత్ర పోషించారు. ఏనాడు పదవులను ఆశించకుండా పార్టీ కొరకే సామాన్య కార్యకర్తగా పని చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి ధార్మిక సెల్ జిల్లా కో కన్వీనర్ వాడపల్లి లక్ష్మణాచార్యులు



గారు వారి మరణం పార్టీకి తీరని లోటు అని ఒక మంచి కార్యకర్తను మనం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పార్టీ వారి కుటుంబానికి ఎప్పుడు ఆసరాగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుక్కునూరు మండల పార్టీ తరపున కుక్కునూరు మండల బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి మణికంఠ, కార్యదర్శి వేములపల్లి శేషగిరిరావు సంతాపం తెలియజేశారు.




# రామస్వామికి గజమాల యాత్రం చెద్దాం

## శెట్టిబలిజ సంఘ నాయకులు పిలుపు




**మొగల్తూరు, జూన్ 8 జనసముద్రం**
**పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**

కోనసీమ అంబేద్కర్ జిల్లా అప్పన్నపల్లి శ్రీబాల బాలాజీ కళ్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయ నిర్మాణకర్త మొల్లేటి రామస్వామి జ్ఞాపకార్థం శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే గజమాలయాత్ర విజయవంతం చేసేందుకు సంఘస్థులంతా విధిగా హాజరు కావాలని మండల శెట్టిబలిజ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ముత్యాలపల్లి, వారతిప్ప గ్రామాల్లోని శెట్టిబలిజ రామాలయాల వద్ద నిర్వహించిన సంఘ సమావేశంలో నాయకులు గుబ్బల రాధాకృష్ణ, పాలా రాంబాబు, డిఎస్, బొంతు చిన్నాలు మాట్లాడారు.

అప్పన్నపల్లి బాల బాలాజీ భక్తులు, సంఘస్థులు జూన్ 25న అప్పన్నపల్లి బాల బాలాజీ స్వామివారి వార్షిక కళ్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయ నిర్మాణ కర్త మొల్లేటి రామస్వామికి నివాళులర్పిస్తూ అదేరోజు నిర్వహించే గజమాల యాత్రలో బైక్ ర్యాలీగా తరలని కోరారు. ఈ సందర్భంగా కార్యాక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసమావేశంలో కడలి మధుసూదనరావు, దొంగ శ్రీఏడుకొండలు, బొక్కా వెంకట్రావు, కృష్ణ, పెంకే చంటి, కుక్కల మల్లేశ్వరంరావు, సత్యనారాయణ, కడలి చంటి తదితరులు పాల్గొన్నారు.

# గొల్లగూడెంలో ఘనంగా 'గ్రామ దర్శిని 2.0'

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 8**
**ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ద్వారకా తిరుమల మండలం గొల్లగూడెం గ్రామంలో సోమవారం 'గ్రామ దర్శిని 2.0' కార్యక్రమం

నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక అభివృద్ధిపై విస్తృత చర్చ జరిగింది. గత రెండు సంవత్సరాల కూటమి పాలనలో, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో గొల్లగూడెంలో జరిగిన అభివృద్ధిని నాయకులు వివరించారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, ఇతర మౌలిక సౌకర్యాల కల్పన కోసం భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేసే దిశగా ఈ 'గ్రామ దర్శిని' కార్యక్రమం ఒక వేదికగా నిలిచిందని వారు పేర్కొన్నారు. గ్రామస్తుల నుంచి సమస్యలకు సంబంధించి పలు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు ద్వారకా తిరుమల మండల టీడీపీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మరియు సమన్వయ



కమిటీ సభ్యులు దేవరపల్లి వీరాస్వామి చౌదరి, రాజమండ్రి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఏపూరి దాలయ్య, జడ్పీటీసీ శ్యామ్యులు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, మరియు సమన్వయ కమిటీ సభ్యులు కంపసాటి రామకృష్ణ అలాగే మండల ఐటీడీపీ అధ్యక్షులు ఏపూరి కిషోర్, గ్రామ టీడీపీ అధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, గ్రామ నాయకులు ఉండవల్లి గోపాలరావు, మూతిన నాగేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో మట్కా స్థావరంపై పోలీసుల దాడి ఐదుగురు అరెస్ట్




**జనసముద్రం న్యూస్, జూన్ 8,2026:**
**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి**

కాగజ్‌నగర్ పట్టణంలో మట్కా జూదంపై పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నికితా పంత్ ఆదేశాల మేరకు,కాగజ్ నగర్ డీఎస్పీ వహీదుద్దిన్ పర్యవేక్షణలో మరియు టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గాంధీ చౌక్ ప్రాంతంలో మట్కా జూదం నిర్వహిస్తున్న వారిపై తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ.4,910 నగదు మరియు 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.మట్కా ఆడుతూ పట్టుబడిన వారిలో నదిగూడకు చెందిన లారీ డ్రైవర్ లక్ష్మణ్ (60), శివాపూర్కు చెందిన కూలీ గులాం జిలాని (67), వంజిరికి చెందిన లారీ డ్రైవర్ పిప్రే దేవాజీ (55), కౌసర్ నగర్కు చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ షబీద్దీన్ (51) మరియు కూలీ సెండే సురేష్ (36) ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో మట్కా, జూదం, గుట్కా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ హెచ్చరించారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. అలాగే సామాన్య ప్రజలు, కార్మికులు ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL/2021/16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb/janasamudram